www.specialeditiondaily.com

SPECIAL EDITION

# స్పెషల్ ఎడిషన్

తెలుగు దినపత్రిక

ON TV TELUGU

PRGI NO. TGTEL/26/A0668

రంగారెడ్డి సంపుటి: 01, సంచిక : 184, సంపాదకులు : యస్.బి.ఎన్ చారి బుధవారం, ఆగస్టు 05, 2026, పేజీలు : 8, వెల : రూ.6/-

## టుడే స్పెషల్

### "ఎర్రదీపం ఆపమంటే... ఆగు!"

వేగమే వీరత్వమని విచ్చలవిడిగా దూసుకెళ్తే,
గమ్యం చేరేది నువ్వు కాదు...నీ ఇంటి గడపకు చేరేది
ఒక విషాద వార్త మాత్రమే!
ఎర్రదీపం – ఆగమంటుంది.
కాశాయ దీపం – ఆలోచించి,
చూసుకొని వెళ్లమంటుంది.
ఆకుపచ్చ దీపం – ఇప్పుడు సాగమంటుంది.
ఆ మూడు రంగులు కేవలం సిగ్నల్‌లు కావు...
వేలాది కుటుంబాల ప్రాణాలకు
నిలువెత్తు రక్షణ కవచాలు. హెల్మెట్ భారమని విసిరేస్తే,
ఒక రోజు నీ కుటుంబమే
బాధల భారాన్ని మోయాల్సి వస్తుంది.
సీట్‌బెల్ట్ చిన్న అలవాటే కావచ్చు...
కానీ అది నీ జీవితానికి పెద్ద భరోసా.
మద్యం మత్తులో స్టీరింగ్ పట్టిన చేయి,
ఒక మనిషిని కాదు...
ఒక కుటుంబం భవిష్యత్తునే చీకటిలోకి నెడుతుంది.
మొబైల్ తెరపై పడిన చూపు,రోడ్డుపై ఒక ప్రాణాన్ని
శాశ్వతంగా మూసివేయొచ్చు.
సిగ్నల్‌ను లెక్కచేయని ఒక్క క్షణం,
శ్మశానానికి దారి చూపే చివరి ప్రయాణం కావొచ్చు.
అతి వేగం ఇచ్చే ఆనందం క్షణికమే...
కానీ అది మిగిల్చే కన్నీరు తరతరాలకు నిలుస్తుంది.
నీ నిర్లక్ష్యానికి రోడ్డు బలిపీఠం కాదు.
అమాయకుల ప్రాణాలు
నీ తొందరపాటుకు బలి కావడానికి పుట్టలేదు.
ఒక్క క్షణం ఓపిక పడితే జీవితం నిలుస్తుంది...
ఒక్క క్షణం అహంకరిస్తే
శాశ్వత నిశ్శబ్దమే మిగులుతుంది.
తల్లి ఎదురుచూసే గడపను కన్నీటి గడపగా మార్చకు.
భార్య కళ్లలో ఆశను విషాదంగా మలచకు.
బిడ్డ పలికే "నాన్న" అనే పిలుపును
అనాథ స్వరంగా మిగల్చకు.
నీ ఇంటి దీపం ఆరిపోతే, నీ వేగం గెలిచిందని
చరిత్ర కూడా చెప్పదు. నిన్ను కోల్పోయిన వారి
కన్నీళ్లే నీ నిర్లక్ష్యానికి సాక్ష్యాలవుతాయి.
రోడ్డు నీ సొంతం కాదు...
ప్రతి అడుగూ ఒక ప్రాణం హక్కు.
ట్రాఫిక్ నిబంధనలు జరిమానాల కోసం కాదు...
నవ్వుతున్న కుటుంబాలు ఏడవకుండా ఉండటానికే.
అందుకే...
ఆవేశానికి కాదు... అవగాహనకు స్టీరింగ్ ఇవ్వు.
వేగానికి కాదు... వివేకానికి ప్రాధాన్యం ఇవ్వు.
ట్రాఫిక్ నిబంధనలు పాటించు...
ప్రాణాలను కాపాడు...
నీ జాగ్రత్తే నీ కుటుంబానికి జీవన భరోసా...
సమాజానికి నువ్విచ్చే గొప్ప బాధ్యత.

**- యస్.బి.ఎన్. చారి, సంపాదకులు**




# పరారీలపై పంజా

## 2021-2026 మధ్య 36 దేశాల నుంచి 274 మంది పరారీ నేరస్థులను స్వదేశానికి రప్పించిన కేంద్రం

**పరారీ నేరస్థుల అప్పగింతను జాతీయ ప్రాధాన్యతగా మార్చిన మోదీ ప్రభుత్వం**

**సాంకేతికత, ఇంటెలిజెన్స్, దౌత్య సమన్వయంతో వేగవంతమైన అప్పగింత ప్రక్రియ**

**పరారీలో ఉన్నా విచారణ, శిక్షకు అవకాశం కల్పించిన కొత్త క్రిమినల్ చట్టాలు**

**ఆర్థిక, ఉగ్రవాద నేరస్థులపై కఠిన చర్యలకు ప్రత్యేక చట్టాల అమలు**

**నేరస్థులకు ఎక్కడున్నా శిక్ష తప్పదనే సందేశం ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం**

న్యూఢిల్లీ, ఆగస్టు 4 (స్పెషల్ ఎడిషన్):

విదేశాలకు పారిపోయి న్యాయవ్యవస్థకు దూరంగా ఉండాలని భావించే నేరస్థులపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో 2021 నుంచి 2026 మధ్య కాలంలో ప్రపంచంలోని 36 దేశాల నుంచి మొత్తం 274 మంది పరారీ నేరస్థులను భారత్‌కు తిరిగి తీసుకువచ్చినట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పరారీ నేరస్థులను స్వదేశానికి రప్పించడం, వారికి చట్టప్రకారం శిక్షలు పడేలా చూడడం, అక్రమంగా సంపాదించిన ఆస్తులను జప్తు చేయడం వంటి అంశాలను కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని కార్యాచరణను వేగవంతం చేసింది. 2014కు ముందు అప్పగింత వ్యవస్థ బలహీనంగా ఉండేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అప్పట్లో భారత్‌కు కేవలం 37 దేశాలతో మాత్రమే అప్పగింత ఒప్పందాలు ఉండగా, ఆర్థిక నేరస్థులపై ప్రత్యేక చట్టాల లేమి, అసంపూర్ణ పత్రాలు, నెమ్మదిగా సాగే న్యాయ ప్రక్రియ కారణంగా విదేశీ కోర్టులు అనేక అభ్యర్థనలను తిరస్కరించేవని వివరించింది. 2004 నుంచి 2013 వరకు ఏడాదికి సగటున నలుగురు నేరస్థులను మాత్రమే భారత్‌కు రప్పించగలిగారని, 110 అప్పగింత అభ్యర్థనలు పెండింగ్‌లో ఉండిపోయాయని తెలిపింది. ఈ పరిస్థితిని పూర్తిగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం పరారీ నేరస్థుల అప్పగింతను 'జాతీయ ప్రాధాన్యత'గా ప్రకటించి, సాంకేతికత, ఇంటెలిజెన్స్, అంతర్జాతీయ దౌత్య సమన్వయాన్ని ఆధారంగా చేసుకుని సమగ్ర వ్యవస్థను అభివృద్ధి చేసింది. ప్రపంచవ్యాప్తంగా నేరస్థుల ఆచూకీ గుర్తించడం, రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయడం, విదేశీ ప్రభుత్వాలతో సమన్వయం పెంచడం వంటి చర్యలను మిషన్ మోడ్‌లో అమలు చేస్తోంది. 2018లో తీసుకొచ్చిన పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల చట్టం ద్వారా ఆర్థిక నేరాలకు పాల్పడి విదేశాలకు పారిపోయిన వ్యక్తులపై

మిగతా 2వ పేజీలో...



# శ్రీశైలానికి భారీగా వరద

## 2.48 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

- 108 టీఎంసీలకు చేరిన మట్టం
- జూరాల ప్రాజెక్టు 33 గేట్లు ఎత్తివేత
- 34.10 టీఎంసీలకు చేరిన ఎస్సారెస్పీ నీటి మట్టం
- పొంగిపొర్లుతున్న పోచారం ప్రాజెక్టు
- నిండు కుండలా ఎగువ మానేరు డ్యాం

హైదరాబాద్, ఆగస్టు 4 (స్పెషల్ ఎడిషన్):

ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా బేసిన్‌లో జలాశయాలకు వరద ప్రవాహం పెరిగింది. రెండు లక్షలకుపైగా క్యూసెక్కుల వరద వస్తున్నది. మంగళవారం సాయంత్రానికి జూరాల ప్రాజెక్టుకు 2.41 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, 33 గేట్లను ఎత్తి 2,21,331 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆల్మట్టికి ప్రస్తుతం 1.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా,

మిగతా 2వ పేజీలో...

# అక్రమ ఆస్తుల వేట

**హైదరాబాద్‌లో ప్రారంభమైన బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ రెండో సమావేశం**

పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుల అప్పగింత, అక్రమ ఆస్తుల రికవరీపై ప్రత్యేక దృష్టి

సభ్య దేశాల మధ్య సమాచార మార్పిడి, చట్ట అమలు సంస్థల సమన్వయానికి ప్రాధాన్యం

సాంకేతికత ఆధారిత పారదర్శక పాలనతో అవినీతికి అడ్డుకట్ట వేయాలని పిలుపు

జీఈఎం, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ వంటి భారత నమూనాలను వివరించిన కార్యదర్శి రచనా షా




హైదరాబాద్, ఆగస్టు 4 (స్పెషల్ ఎడిషన్):

అవినీతి, ఆర్థిక నేరాలు, అక్రమ ఆస్తుల తరలింపు వంటి అంతర్జాతీయ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే దిశగా బ్రిక్స్ దేశాలు మరింత సమన్వయంతో ముందుకు సాగాలని భారత ప్రభుత్వం పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ వేదికగా మంగళవారం ప్రారంభమైన రెండు రోజుల బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ (ఏసీడబ్ల్యూజీ) రెండో సమావేశంలో సభ్య దేశాల ప్రతినిధులు కీలక అంశాలపై చర్చలు ప్రారంభించారు. ఆగస్టు 4, 5 తేదీల్లో జరిగే ఈ సమావేశంతో పాటు బ్రిక్స్ అసెట్ రికవరీ నిపుణుల నెట్‌వర్క్

మిగతా 2వ పేజీలో...



# నియామకాలపై నిఘా

## 7,437 పోలీస్ పోస్టుల భర్తీని పారదర్శకంగా నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

పరీక్షలకు భంగం కలిగించే కుట్రలను అడ్డుకోవాలని ఉన్నతాధికారులకు స్పష్టమైన సూచనలు

ప్రశ్నపత్రాల తయారీ నుంచి పరీక్షల ముగింపు వరకు కట్టుదిట్టమైన భద్రత

కోచింగ్ సెంటర్లు, సోషల్ మీడియా, నకిలీ వెబ్‌సైట్లపై ప్రత్యేక నిఘా

సైబర్ క్రైమ్, ఇంటెలిజెన్స్ విభాగాలు పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 4 (స్పెషల్ ఎడిషన్)

రాష్ట్రంలో ఇటీవల ప్రకటించిన 7,437 పోలీస్ ఉద్యోగాల నియామక ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకత, కట్టుదిట్టమైన భద్రతతో నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. నియామక పరీక్షలను ఎట్టి పరిస్థితుల్లోనూ వివాదాలకు తావులేకుండా, అభ్యర్థుల విశ్వాసాన్ని నిలబెట్టేలా నిర్వహించాలని స్పష్టం చేశారు. పోలీస్ నియామకాలకు సంబంధించి కొన్ని రాజకీయ పార్టీలు, ఇతర స్వార్థపూరిత శక్తులు పరీక్షల నిర్వహణకు భంగం కలిగించే ప్రయత్నాలు చేస్తున్నట్లు నిఘా వర్గాలు అందించిన సమాచారాన్ని ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్, పోలీస్ ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించి పరిస్థితులను సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, భద్రపరిచే విధానం, రవాణా, పంపిణీ, పరీక్ష కేంద్రాల నిర్వహణ

మిగతా 2వ పేజీలో...

# డిఫాల్ట్ మిల్లర్లపై ఉక్కుపాదం

ప్రతి రూపాయి, ప్రతి గింజను వసూలు చేస్తాం

దశాబ్ద కాలం సీఎంఆర్ వ్యవస్థపై సమగ్ర ఆడిట్

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడి



2

## ప్రభుత్వ ఆఫీసులన్నింటికీ

# 'టీ-ఫైబర్'ద్వారానే నెట్

## 1 నుంచి ప్రైవేట్ ఆపరేటర్లకు బిల్లులు చెల్లించొద్దు

- ఇంటింటికీ ఇంటర్‌నెట్ వర్తింపజేయాలి
- అధికారులను ఆదేశించిన మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, ఆగస్టు 4 (స్పెషల్ ఎడిషన్):

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1నుంచి 'టీ-ఫైబర్' ద్వారానే ఇంటర్‌నెట్ సేవలు అందించాలని ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. సెప్టెంబర్ 1 తర్వాత ఎట్టిపరిస్థితుల్లో ప్రైవేట్ ఆపరేటర్లకు బిల్లులు చెల్లించొద్దని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో 'టీ-ఫైబర్'పై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టీ-ఫైబర్ నెట్‌వర్క్ వినియోగం ద్వారా ఏటా ప్రభుత్వానికి సుమారు రూ.300 కోట్ల నుంచి రూ.400 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు.

మిగతా 2వ పేజీలో...

## కేసీఆర్ కుటుంబం వల్లే

# సింగరేణికి నష్టం

బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు

**రూ.54 వేల కోట్ల బకాయిలు పెట్టాయి**

ప్రధాని మోదీ సహకారంతోనే సింగరేణికి మూడో బ్లాక్

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 4 (స్పెషల్ ఎడిషన్):

తెలంగాణ అభివృద్ధికి నరేంద్రమోదీ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని, ఇందులో భాగంగానే తాజాగా సింగరేణికి వరుసగా మూడో కోల్ బ్లాక్ పీకేవోసీ డిప్‌సైడ్ దక్కిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సింగరేణికి నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా బకాయిలు పడిందని, కేసీఆర్ కుటుంబంతో సింగరేణి సంస్థకు ఎంతో నష్టం వాటిల్లిందని ఆయన విమర్శించారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి పుణ్యమా అని సింగరేణికి రూ.54 వేల కోట్లు బకాయిలు పేరుకు పోయాయని తెలిపారు. మంగళవారం ఢిల్లీ లో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తను బొగ్గు శాఖ మంత్రి అయినప్పటి నుం చి రాష్ట్రప్రభుత్వంతో చర్చిస్తూ.. సింగరేణికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నానని చెప్పారు. వేలంలో పాల్గొనడం ద్వారా వీలైనన్ని ఎక్కువ బ్లాక్స్‌ను పొందేలా ప్రోత్సహిస్తున్నానని, దీంట్లో భా గంగా.. పీకేఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి దక్కిందన్నారు. అనేక కంపెనీలు వేలంలో పాల్గొనడానికి ముందుకు వచ్చినా సింగరేణి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముందుకెళ్లాలని కోరినట్లు తెలిపారు. తాజా కోల్ బ్లాక్ కేటాయింపుతో సింగరేణికి కొత్త ఆశలు చిగురించాయని, సింగరేణిని గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ దోచుకునేందుకు ప్రయ త్నించాయని విమర్శించారు. కేసీఆర్, రేవం త్ పుణ్యమా అని సింగరేణి కార్మికులకు సంబంధించిన రూ.54 వేల కోట్లు బకాయిలు పేరుకుపోయాయన్నారు.

మిగతా 2వ పేజీలో...

# పరారీలపై పంజా

మొదటి పేజీ తరువాయి...

కఠిన చర్యలకు చట్టబద్ధత కల్పించగా, 2019లో అమల్లోకి వచ్చిన ఎన్ఐఏ (సవరణ) చట్టం మరియు యూఏపీఏ (సవరణ) చట్టం ద్వారా ఉగ్రవాదులు, వారి హ్యాండ్లర్లు, నిధులు సమకూర్చే వ్యవస్థలు, సహాయక నెట్‌వర్క్‌లపై కూడా కఠిన చర్యలకు అవకాశం ఏర్పడింది. దీంతో విదేశాల్లో తలదాచుకున్న ఉగ్రవాద నేరస్థులను గుర్తించడం, వారిని స్వదేశానికి రప్పించడం మరింత సమర్థవంతంగా మారిందని ప్రభుత్వం పేర్కొంది. అలాగే 2024లో అమల్లోకి వచ్చిన మూడు కొత్త క్రిమినల్ చట్టాల్లో భాగమైన భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)లిలోని సెక్షన్లు 355, 356 ద్వారా పరారీలో ఉన్న నిందితుడు కోర్టుకు హాజరుకాకపోయినా విచారణ కొనసాగించి, శిక్ష ఖరారు చేసే వెసులుబాటు కల్పించారు. ఈ నిబంధనలతో విదేశాల్లో దాక్కున్న నేరస్థులు చట్టం నుంచి తప్పించుకునే అవకాశాలు గణనీయంగా తగ్గాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశ సార్వభౌమాధికారం, ఆర్థిక స్థిరత్వం, శాంతిభద్రతలు, జాతీయ భద్రతకు ముప్పుగా మారే పరారీ నేరస్థులపై రాజీ లేని వైఖరితో కేంద్ర ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందని, ప్రపంచంలో ఎక్కడ దాక్కున్నా నేరస్థులకు భారత చట్టం నుంచి తప్పించుకునే అవకాశం లేదనే స్పష్టమైన సందేశాన్ని ఈ చర్యలు ఇస్తున్నాయని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# నియామకాలపై నిఘా

మొదటి పేజీ తరువాయి...

తదితర ప్రతి దశలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. నియామక ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు, నిర్లక్ష్యం లేదా అవకతవకలకు ఆస్కారం లేకుండా అన్ని నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు కోచింగ్ సెంటర్ల కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పేర్కొన్నారు. పరీక్షలకు సంబంధించిన తప్పుడు ప్రచారం, పుకార్లు, ప్రశ్నపత్రాల లీకేజీ పేరుతో సోషల్ మీడియాలో జరిగే దుష్ప్రచారాన్ని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలకు పాల్పడే దళారులు, నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఖాతాలు, సైబర్ మోసగాళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం సైబర్ క్రైమ్ విభాగం, ఇంటెలిజెన్స్ విభాగాలు సమన్వయంతో పనిచేసి పరీక్షల నిర్వహణ పూర్తయ్యే వరకు నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ప్రధాన కార్యదర్శి శిఖా గోయల్, తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సీపీ సజ్జనార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో నియామక ప్రక్రియను పూర్తిగా నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు.

# శ్రీశైలానికి భారీగా వరద

మొదటి పేజీ తరువాయి...

అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదలచేస్తున్నారు. నారాయణపూర్‌కు 1,45,400 లక్షల క్యూసెక్కులు వస్తుండగా, 1,45,376 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం జలాశయంలోకి భారీగా వరద వస్తున్నది. ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 2,48,148 క్యూసెక్కుల జలాలు వచ్చి చేరుతున్నాయి. మహారాష్ట్రలో కురిసి వర్షాలతో గోదావరి బేసిన్‌లోని శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. మెదక్, కామారెడ్డి జిల్లాల మధ్య 1.820 టీఎంసీల సామర్థ్యం ఉన్న పోచారం ప్రాజెక్టులోకి 2,150 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకోవడంతో అలుగు పోస్తున్నది. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ఎగువమానే పూర్తిస్థాయి నీటిమట్టం 31 అడుగులకు, 24 అడుగుల నీరు చేరింది. మరో ఏడడుగులు చేరితే మత్తడి దూకే అవకాశం ఉన్నది.

**కామారెడ్డి జిల్లాలో 18 సెంటీమీటర్ల వర్షం**

కామారెడ్డి జిల్లాలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు 18 సెంటీమీటర్ల వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతున్నది. కామారెడ్డి పెద్ద చెరువు అలుగులు వెళ్తున్నది. కామారెడ్డి సుభాష్ థియేటర్ వద్ద అర్ధరాత్రి రోడ్డుపై వరద నీరు ప్రవహించడంతో ప్రైవేట్ బస్సు పెళ్లి కోసం వస్తుండగా సైలెన్సర్‌లోకి నీరు వెళ్లడంతో మధ్యలోనే ఆగిపోయింది. వెంటనే సంఘటన స్థలానికి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకొని బస్సులోని ప్రయాణికులను తాడు సాయంతో బయటకు తీశారు. పోచారం ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నది. సింగీతం ప్రాజెక్ట్ గేట్లు ఎత్తారు. కళ్యాణి ప్రాజెక్ట్ మూడు గేట్లు ఎత్తారు. నల్లమడుగు ప్రాజెక్ట్ వద్ద జోరుగా వాగు ప్రవహిస్తున్నది. జిల్లాలో 18 వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

# ప్రభుత్వ ఆఫీసులన్నింటికీ 'టీ-ఫైబర్'ద్వారానే నెట్

మొదటి పేజీ తరువాయి...

అంతేకాకుండా ఇంట్రానెట్ బేసిస్‌లో సెక్యూర్డ్ ఇంటర్నెట్ యాక్సెస్ కల్పించడం ద్వారా రాష్ట్ర డేటా సెంటర్‌కు అనుసంధానం ఏర్పడి, పూర్తి స్థాయి డేటా సెక్యూరిటీ చేకూరుతుందన్నారు. గడిచిన ఆరు నెలల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 4,487 ప్రభుత్వ కార్యాలయాలకు 'టీ-ఫైబర్' ద్వారా ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు ఇప్పటికే సుమారు రూ.13 కోట్లు ఆదా అయ్యిందన్నారు. మరిన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఈ సేవలను విస్తరించేందుకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో తలెత్తే లోపాలను ఎప్పటికప్పుడు సరిచేస్తూనే రాబోయే రోజుల్లోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణ వైడ్ ఏరియా నెట్‌వర్క్(టీ-స్వాన్)ను నెల రోజుల్లోపు పూర్తిస్థాయిలో టీ-ఫైబర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'భారత్ ఫ్యూచర్ సిటీ'కి పూర్తిస్థాయిలో ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని 'టీ-ఫైబర్'కు సూచించారు. అలాగే ఇంటింటికీ ఇంటర్నెట్ అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని, దీనికోసం ప్రిన్సిపుల్ మానిటైజేషన్ పార్టనర్‌ను ఎంపిక చేసేందుకు టెండర్లు పిలవాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎస్ సంజయ్ జాజు, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీ-ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ కుటుంబం వల్లే సింగరేణికి నష్టం

మొదటి పేజీ తరువాయి...

**బకాయిలు ఎందుకివ్వట్లేదు..**

సింగరేణికి బకాయిలు ఎందుకు ఇవ్వట్లేదు? సింగరేణి తెలంగాణలో లేదా? సింగరేణి కార్మికులు తెలంగాణ ప్రజలు కాదా? రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు. 'కిషన్ రెడ్డి సింగరేణికి అన్యాయం చేశారంటూ కేసీఆర్ కొడుకు మాట్లాడుతున్నాడు. సింగరేణికి అన్యాయం చేసిందెవరో చర్చకు సిద్ధమా? మీ కుటుంబం పుణ్యమా అని సంస్థ దివాళా తీసే ప్రమాదంలో ఉంది. నేను బొగ్గు శాఖ మంత్రి అయ్యాకే సింగరేణికి న్యాయం జరుగుతోంది. ఈ సంస్థకు ఉన్న రూ. 54వేల కోట్ల బకాయిలు ఇచ్చేలా రాష్ట్ర బీజేపీ తరపున ఒత్తిడి చేస్తాం' అని ఆయన తెలిపారు.

**కేసుపెట్టిన డీసీపీపై వేధింపులు**

ఫేస్‌బుక్‌లో, ఇన్‌స్టాగ్రాంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని, అభ్యంతరకరంగా మార్ఫింగ్ చేస్తూ పోస్టులు చేశారని, మోదీ తల్లిపై కూడా నీచంగా, అవమానవీయంగా పోస్టులు పెట్టారని మండిపడ్డారు. దీనిపై బీజేపీ నేత సాయి కిరణ్.. సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, ఆ ఫిర్యాదు ఆధారంగా హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. ఐటీ చట్టం ప్రకారం జూలై 29 న సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ కేసు నమోదు చేశారని, దర్యాప్తులో భా గంగా.. పోస్టులు చేసినవారితోపాటుగా మెటా ఇండియా హెడ్‌కు కూడా నోటీసులు ఇచ్చారన్నారు. అయితే మెటా సంస్థకు నోటీసులు ఇచ్చిన డీసీపీ అరవింద్‌బాబుని రాష్ట్ర ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందన్నారు. మెటా కంపెనీపై ఎలా కేసు పెడతారంటూ.. ఢిల్లీ నుంచి రాహుల్‌గాంధీ.. తెలంగాణ కాంగ్రెస్ చీఫ్, తెలంగాణ సీఎంపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో డీసీపీని బదిలీ చేశారని చెబుతున్నారన్నారు. రెండేళ్లలో 44 సార్లు అధికారుల బదిలీలతోఆందోళన నెలకొందని, డీసీపీని బదిలీ చేసి, మిగిలిన అధికారులను కూడా బెదిరిస్తున్నారని పేర్కొన్నారు.

**గతంలో ఫామ్‌హౌస్ ఫైల్స్‌తో..**

'ఫాంహౌస్ ఫైల్స్' పేరుతో గతంలో కేసీఆర్ ప్రతిపక్ష నేతలను, మీడియా వ్యక్తులను, సినిమా నటులను, కుటుంబసభ్యులపై కూడా ఫోన్ ట్యాపింగ్ చేసి అధికార దుర్వినియోగం చేసింది అందరూ చూశారని, తన ఫోన్‌ను ట్యాప్ చేశారని కేసీఆర్ కూతురే చెప్పారన్నారు. కాంగ్రెస్ మద్దతుతో తమిళనాడులో అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వం.. అక్కడి ప్రతిపక్ష నేత ఏదో చేశాడని ఆయన్ను అరెస్టు చేశారని, మరి వారికి అక్కడో న్యాయం.. ప్రధాని మోదీపై వ్యాఖ్యలు చేస్తే ఇక్కడ మరో న్యాయమా? అని ప్రశ్నించారు. 2020లో 5,024 సైబర్ క్రైం కేసులు నమోదైతే.. 2024లో 27,230 కేసులు నమోదయ్యాయన్నారు.

# డిఫాల్ట్ మిల్లర్లపై ఉక్కుపాదం

## ప్రతి రూపాయి, ప్రతి గింజను వసూలు చేస్తాం

## దశాబ్ద కాలం సీఎంఆర్ వ్యవస్థపై సమగ్ర ఆడిట్

## మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడి



హైదరాబాద్, ఆగస్టు 4 (స్పెషల్ ఎడిషన్):

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వ్యవస్థపై గత పది నుంచి పన్నెండు సంవత్సరాల కార్యకలాపాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ధాన్యం సేకరణ నుంచి బియ్యం అప్పగింత వరకు జరిగిన ప్రతి లావాదేవీ, మిల్లర్ల వారీగా డిఫాల్టు, పెండింగ్ బకాయిలు, రికవరీలు, విజిలెన్స్ దర్యాప్తులు, న్యాయపరమైన చర్యలు, అమలు వ్యవస్థలను క్షుణ్ణంగా సమీక్షించి, భవిష్యత్తులో ఇలాంటి లోపాలకు తావులేకుండా సమ గ్ర సంస్కరణలు చేపట్టాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం పౌరసరఫరాల శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. దశాబ్దకాలంగా జరిగిన ధాన్యం సేకరణ, సీఎం ఆర్ బకాయిలు, ఎఫ్‌సీఐకి అప్పగించిన బియ్యం, జిల్లాల వారీగా, మిల్లర్ల వారీగా పెండింగ్ డిఫాల్ట్, రికవరీల పురోగతి, విజిలెన్స్ కేసులు, న్యాయపరమైన చర్యలను విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడు తూ, తప్పుడు విధానాలను అవలంబించిన వారికి శిక్షలు విధించడం మాత్రమే కాదు.. ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసి న ప్రభుత్వ ధాన్యాన్ని, ప్రభుత్వానికి రావలసిన ప్రతి రూపాయిని పూర్తిగా తిరిగి రాబట్టడమేనని ప్రభుత్వ లక్ష్యమన్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కింద కొనుగోలు చేసే ప్రతి ధాన్యం గింజ వెను క తెలంగాణ రైతు చెమటతో పాటు ప్రజ ల సొమ్ము ఉందన్నారు. సివిల్ సప్లయ్ శాఖ రైతుల నుంచి కొనుగోలు చేసిన ధా న్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం ఎంపిక చేసిన రైస్ మిల్లర్లకు అప్పగిస్తుందని, వా రు ఒప్పందం ప్రకారం నిర్దేశిత పరిమాణం, నాణ్యతతో బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి అప్పగించాల్సిన బాధ్యత కలిగి ఉంటారని మంత్రి గుర్తు చేశారు.

**టన్ను బియ్యం తగ్గినా..**

మిల్లర్‌కు అప్పగించే ప్రతి బస్తా ధాన్యం ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసిన ప్రభుత్వ ఆస్తి అని, అందులో ఒక్క గింజ దారి మళ్లినా అది తెలంగాణ ప్రజలకు నష్టమన్నారు. ప్రభుత్వానికి రావలసి న ఒక్క టన్ను బియ్యం తగ్గినా ప్రజా పంపిణీ వ్యవస్థ బలహీనపడుతుందని మంత్రి ఘాటుగా హెచ్చరించారు. పెండింగ్ బకాయిల్లో ఎక్కువ భాగం గత ప్రభుత్వాల కాలంలో పేరుకుపోయినవేనని, ప్రస్తు తం వాటి రికవరీకే అత్యంత ప్రాధాన్యం ఇ స్తున్నామని తెలిపారు. నగదు రూపంలో చెల్లింపులు, ధాన్యం తిరిగి అప్పగింత, నాణ్యమైన బియ్యం సరఫరా వంటి అన్ని మార్గాల ద్వారా గరిష్ఠ స్థాయిలో రికవరీలు సాధించే చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. డిఫాల్ట్ మిల్లర్లకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన పరిమిత గడువు కారణంగా ఇప్పటికే గణనీయమైన రికవరీలు జరిగాయని అధికారులు తెలిపారు. మిగిలిన ప్రతి కేసుపై మిల్లర్ వారీగా గడువు నిర్ధారించి ప్రత్యేక రికవరీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి ఆదేశించారు.

**సమూల సంస్కరణలు..**

సీఎంఆర్ విధానంలో మార్పులు తీసుకురానున్నట్లు మంత్రి తెలిపారు. ఒప్పంద నిబంధనలను మరింత కఠినతరం చేయడం, బ్యాంకు గ్యారంటీలను బలోపేతం చేయడం, డిఫాల్టర్లపై కఠిన చర్యలు తీసుకునే అంశాలను కొత్త విధానంలో చేర్చాలని నిర్ణయించి నట్లు చెప్పారు. పెండింగ్ రికవరీలు, ఆస్తుల జప్తు, బ్యాంకు గ్యారంటీల అమలు, సివిల్, క్రిమినల్ కేసుల పురోగతితో పాటు రికవరీలకు అడ్డంకిగా ఉన్న ప్రతి పరిపాలనా అవ రోధాన్ని వెంటనే తొలగించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో ఒక్క గింజ కూడా దారి మళ్లకుండా సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలను ప్రవే శపెట్టాలన్నారు. దీనిలో క్యూఆర్ కోడ్‌తో గన్నీ సంచులు, జీపీఎస్ ఆధారిత వాహన ట్రాకింగ్, జియో ట్యాగ్ తనిఖీలు, రియల్ టైమ్ స్టాక్ రీకన్సిలియేషన్, ప్రొక్యూర్మెంట్-మిల్లింగ్-ఎఫ్సీఐ డేటాబేస్ల అనుసంధానం, ఎర్లీ వార్నింగ్ వ్యవస్థ, రిస్క్ ఆధారిత మిల్లుల ఆడిట్లు వంటి ఆధునిక వ్యవస్థలను ప్రవేశపెట్టాలని మంత్రి సూచించారు.

**నిజాయితీ మిల్లర్లకు పూర్తి భరోసా..**

డిఫాల్ట్ కారణంగా రైతులు ఏ విధంగానూ ఇబ్బంది పడరని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కనీస మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు, రైతుల ఖాతాల్లో నేరుగా సకాలంలో చెల్లింపులు, సేకరణ ప్రక్రి య యథావిధిగా కొనసాగుతాయని హామీ ఇచ్చారు. నిజాయితీగా పనిచేస్తున్న రైస్ మిల్లర్లకు భయపడాల్సిన అవసరం లేదని, వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. అయితే ప్రభుత్వ ధాన్యాన్ని దారి మళ్లించే వారు, ఒప్పందాలను ఉల్లంఘించే వారు మాత్రం ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని మంత్రి హెచ్చరించారు. ప్రజల ఆస్తిని కాపాడటంలో, ప్రభుత్వ బకాయిలను పూర్తిగా రాబట్టటంలో, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయటంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్, ప్రొక్యూర్మెంట్, ఫైనాన్స్, లాజిస్టిక్స్, లీగల్, మార్కెటింగ్ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**విజిలెన్స్ దాడులు కొనసాగుతాయి**

రాష్ట్రంలోని అత్యధిక మంది రైస్ మిల్లర్లు నిజాయితీగా ప్రభుత్వంతో కలిసి పనిచేశారని, అయితే కొద్దిమంది మాత్ర మే బియ్యం అప్పగింతలో జాప్యం చేయ డం, ప్రభుత్వ ధాన్యాన్ని దారి మళ్లించ డం, ఒప్పందాలను ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడ్డారని మంత్రి తెలిపారు. అన్నారు. ఈ సమావేశంలో విజి లెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ జనరల్ డి.ఎస్. చౌహాన్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ప్రభుత్వ ధా న్యంపై నిర్వహించిన తనిఖీలు, దాడులు, నమోదుచేసిన క్రిమినల్ కేసులు, రికవరీలు, న్యాయపరమైన చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైస్ మిల్లుల్లో భౌతిక తనిఖీలు, స్టాక్ల ధృవీకరణ, స్టాక్ రిజిస్టర్ల పరిశీలన, కొనుగోలు రికార్డులతో సరిపోల్చడం, ప్రభుత్వ ధాన్యం లేదా బియ్యం అక్రమ మళ్లింపులపై లోతైన విచారణ కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ ఆస్తి దుర్వినియోగం, నమ్మకద్రోహం వంటి నే రాలకు ఆధారాలు లభించిన ప్రతి సందర్భంలో క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, పదేపదే డిఫాల్ట్ చేస్తున్న మిల్లర్లపై బ్లాక్లిస్టింగ్ సహా కఠిన పరిపాలనా చర్యలు తీసుకుంటామని అధికారు లు తెలిపారు.

# విద్యా వ్యవస్థను సీఎం రేవంత్ నాశనం చేస్తున్నారు

న్యూఢిల్లీ: ఇంజనీరింగ్ విద్యార్థులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ఖండించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా సీఎం వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్య పట్ల చిత్తశుద్ధి లేని వ్యక్తి విద్యాశాఖ మంత్రి గా ఉండటం సరైనది కాదని అరవింద్ అన్నారు. విద్యాశాఖ బాధ్యతలను మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తే బాగుంటుందని సూచించారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అరవింద్ సవాల్ విసిరారు. ఎవరి సహకారం లేకుండా రేవంత్ రెడ్డి నామినేషన్ పత్రాలు నింపగలరా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కూడా లేవని అరవింద్ ఆరోపించారు. కొన్ని పాఠశాలల్లో బ్లాక్ బోర్డులు, చాక్ పీసులు, విద్యార్థులకు సరైన మరుగుదొడ్లు లేని పరిస్థితి ఉందన్నారు. విద్యాశాఖ మంత్రిగా సీఎం ఒక్క ప్రభుత్వ పాఠశాలను అయినా సందర్శించారా అని ప్రశ్నించారు. ఉన్న పాఠశాలలను అభివృద్ధి చేయకుండా కొత్త పాఠశాలల నిర్మాణం పేరుతో ప్రభుత్వం కమిషన్ల కోసం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీ అరవింద్ డిమాండ్ చేశారు.

# హరీశ్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారు

## టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు



హైదరాబాద్, ఆగస్టు 4 (స్పెషల్ ఎడిషన్):

బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అందుకు తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అరుంధతి సినిమా తరహాలో ఆయన పూజలు నిర్వహిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు ఈ ఏడాది మార్చి 2న తమిళనాడులోని తిరుచ్చికి, జూన్ 1న కర్ణాటకలోని శివమొగ్గకు వెళ్లారని.. ఆ తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో ప్రజలకు వివరించాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. తిరుపతికి వెళ్లినప్పుడు మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. అఘోరీ ఆలయానికి వెళ్లిన విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచారని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. తెలంగాణలో వర్షాలు పడకూడదని, కరువు రావాలని కోరుకుంటూ ఆయన క్షుద్ర పూజలు చేశారని మహేశ్ గౌడ్ ఆరోపించారు. ప్రజల సంక్షేమం కోసం దేవుడిని ప్రార్థించడం సహజమని.. కానీ మాజీ మంత్రి మాత్రం ప్రజలకు కీడు జరగాలని పూజలు చేశారని విమర్శించారు. తన రాజకీయ స్వార్థం కోసమే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై నిజాలు బయటపెట్టినందుకే అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్‌లకు లీగల్ నోటీసులు పంపించారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అయితే లీగల్ నోటీసులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అఘోరాలతో క్షుద్ర పూజలు చేశారనే ప్రచారం గతంలో జరిగిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ చెప్పారు. ఇప్పుడు హరీశ్ రావుపై వస్తున్న ఆరోపణలతో కేసీఆర్ పూజలు కూడా నిజమేనని అనిపిస్తోందన్నారు. యాదగిరిగుట్టకు వెళ్లి పొర్లు దండాలు పెట్టి మరీ ఏం చేశారో ప్రజలకు హరీశ్ రావు చెప్పాలని ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. గతంలో మంత్రాలు, తంత్రాల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన ఘటనలు ఉన్నాయని, దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఇలాంటి ఆచారాలను బలంగా నమ్ముతారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. కాగా, టీపీసీసీ చీఫ్ ఆరోపణలపై హరీశ్ రావు, బీఆర్ఎస్ నుంచి ఎలాంటి స్పందన వస్తుందో వేచి చూడాలి.

# అక్రమ ఆస్తుల వేట

మొదటి పేజీ తరువాయి...

రెండో సమావేశం కూడా నిర్వహిస్తున్నారు. సమావేశాన్ని ప్రారంభించిన భారత ప్రభుత్వ సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి రచనా షా మాట్లాడుతూ, సుస్థిరమైన అభివృద్ధికి అవినీతి అతిపెద్ద అడ్డంకిగా మారిందన్నారు. ప్రజలకు అందాల్సిన నిధులు ఆసుపత్రులు, పాఠశాలలు, మౌలిక వసతుల అభివృద్ధికి చేరకుండా అవినీతి మళ్లిస్తోందని, తద్వారా ప్రజల విశ్వాసం దెబ్బతింటోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అవినీతి అనేది ఒక్క దేశానికి పరిమితమైన సమస్య కాదని, దాన్ని ఏ దేశమూ ఒంటరిగా ఎదుర్కోలేదని పేర్కొన్న రచనా షా... అక్రమ ఆర్థిక లావాదేవీలను అరికట్టడం, ప్రజా సంపదను కాపాడటం, అంతర్జాతీయ అవినీతి నిరోధక వ్యవస్థను బలోపేతం చేయడం కోసం బ్రిక్స్ దేశాలు సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సమగ్రత, జవాబుదారీతనం, పరస్పర సహకారం, సాంకేతిక ఆవిష్కరణలే అవినీతిపై పోరాటానికి బలమైన ఆయుధాలని ఆమె స్పష్టం చేశారు.

పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తులు ప్రపంచ దేశాలకు సవాలుగా మారారని పేర్కొన్న ఆమె, నేరస్తులకు ఏ దేశమూ ఆశ్రయం కల్పించకూడదని స్పష్టం చేశారు. అలాంటి నేరస్తులను గుర్తించడం, వారి అప్పగింతకు సహకరించడం, దొంగిలించిన ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకోవడం, అక్రమ నిధుల తరలింపుకు అవకాశం కల్పిస్తున్న లోపాలను తొలగించడం వంటి అంశాల్లో బ్రిక్స్ దేశాలు మరింత బలమైన సహకార వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అవినీతి ఆరోపణలతో పరారీలో ఉన్న నిందితులను గుర్తించి వారి అప్పగింత ప్రక్రియను వేగవంతం చేయడానికి ఏర్పాటు చేసిన బ్రిక్స్ అనధికారిక సహకార భాండాగారం పురోగతిని ఆమె స్వాగతించారు. అలాగే బ్రిక్స్ దేశాల చట్ట అమలు సంస్థల మధ్య సహకారాన్ని పెంపొందించేందుకు ప్రతిపాదించిన బ్రిక్స్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాక్టీషనర్ల నెట్‌వర్క్ త్వరగా కార్యరూపం దాల్చాలని ఆకాంక్షించారు. అక్రమ ఆస్తుల రికవరీ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఏర్పాటు చేసిన బ్రిక్స్ అసెట్ రికవరీ నిపుణుల నెట్‌వర్క్ కీలక పాత్ర పోషిస్తుందని రచనా షా పేర్కొన్నారు. సమాచార మార్పిడి కోసం రూపొందించిన ప్రామాణిక నమూనాలు, ప్రతి దేశంలోని నోడల్ అధికారులు, నిపుణుల డైరెక్టరీ ద్వారా చట్ట అమలు సంస్థల మధ్య వేగవంతమైన, సమర్థవంతమైన సమన్వయం సాధ్యమవుతుందని వివరించారు. అవినీతిని నిరోధించడంలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్న ఆమె... డిజిటల్ గుర్తింపు వ్యవస్థలు, ఆన్‌లైన్ సేవలు, డిజిటల్ చెల్లింపులు, పారదర్శక కొనుగోలు విధానాలు అవినీతికి అడ్డుకట్ట వేయడంలో సమర్థవంతమైన సాధనాలుగా నిలుస్తున్నాయని తెలిపారు. భారత ప్రభుత్వం అమలు చేస్తున్న గవర్నమెంట్ ఇ-మార్కెట్‌ప్లేస్ (జీఈఎం), ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ), ముఖరహిత పన్ను విధానం, డేటా ఆధారిత పర్యవేక్షణ, సాంకేతిక నిఘా వ్యవస్థలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని వివరించారు.

సమావేశంలో నిర్వహిస్తున్న "నవకల్పనలు --సాంకేతికత ఆధారిత వ్యవస్థల ద్వారా నైతిక పరిపాలన" అంశంపై ప్రత్యేక సదస్సు ద్వారా సభ్య దేశాలు తమ అనుభవాలను పంచుకుని, అవినీతి నిరోధక రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థంగా వినియోగించే మార్గాలపై చర్చించనున్నట్లు కార్యదర్శి తెలిపారు. బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర విశ్వాసం, సమాచార భాగస్వామ్యం, చట్ట అమలు సంస్థల సమన్వయం మరింత బలోపేతమైతే అంతర్జాతీయ స్థాయిలో అవినీతికి, ఆర్థిక నేరాలకు సమర్థవంతంగా అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుందని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

స్పెషల్ ఎడిషన్ తెలుగు దినపత్రిక
బుధవారం, ఆగస్టు 05, 2026

## శ్రీ బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా

బద్వేలు : బద్వేలు నియోజకవర్గంలో వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్య కలలను సాకారం చేసి, బద్వేలు పట్టణానికే తలమానికమైన శ్రీ బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. శ్రీ బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాల 1979 వ సంవత్సరంలో స్థాపించబడి విభిన్నమైన కోర్సులతో వేలాదిమంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించింది. జాతీయస్థాయిలో అక్రిడియేషన్ గుర్తింపు పొంది, నేడు యు జి సి ద్వారా స్వయం ప్రతిపత్తి హోదా సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలియజేశారు. యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలల్లో ఎన్నోసార్లు ప్రథమ స్థానంలో నిలిచి ఉమ్మడి కడప జిల్లాలో నెంబర్ వన్ విద్యాసంస్థగా గుర్తింపు పొందింది శ్రీ బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాల. కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా లభించినందుకు శ్రీ బిజివేముల వీరారెడ్డి విద్యాసంస్థల కరస్పాండెంట్ కె.విజయమ్మ కళాశాల సెక్రెటరీ శ్రీ కె.రితేష్ రెడ్డి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా బి.ఏ,బి.కాం,బి.ఎస్సీ కోర్సులలో అడ్మిషన్ల కొరకు కళాశాల కార్యాలయాన్ని సంప్రదించవలసినదిగా ప్రిన్సిపాల్ తెలిపారు.

## పాఠశాలల తనిఖీలో విద్యార్థుల చదవడం, రాయడం నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి

సి. బెలగల్ : సి. బెలగల్ మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల అభ్యాస సామర్థ్యం పెంపు లక్ష్యంగా మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ-1) విస్తృతంగా పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీఎస్ కోతకోట (ఆర్), ఎస్‌పీఎల్ ముదుమాల (ఆర్), ఎస్‌పీఎల్ కె. సింగవరం పాఠశాలలను సందర్శించి అక్కడ అమలవుతున్న విద్యా కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో నిర్వహిస్తున్న రెడినెస్ ప్రోగ్రామ్ అమలు తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న రెడినెస్ పుస్తకాలు, రికార్డులు, బోధనా ప్రణాళికలను తనిఖీ చేసి వాటి నిర్వహణపై ఆరా తీశారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి చదవడం రాయడం నైపుణ్యాలను పరిశీలించారు. ఒక్కో విద్యార్థిని చదివించి, రాయించి వారి అభ్యాస స్థాయిని అంచనా వేశారు. విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం బలోపేతానికి ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ వహించాలని ఎంఈఓ-1 సూచించారు. ప్రతి విద్యార్థి తన తరగతికి తగిన స్థాయిలో చదవడం, అర్థం చేసుకోవడం, రాయడం వంటి నైపుణ్యాలను సాధించేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని చెప్పారు. అభ్యాసంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ అందించాలన్నారు. అలాగే తరగతి గదుల్లో బోధనను మరింత ఆసక్తికరంగా నిర్వహిస్తూ విద్యార్థుల భాగస్వామ్యాన్ని పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. రెడినెస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ప్రతి కార్యకలాపాన్ని నాణ్యతతో అమలు చేయడంతో పాటు సంబంధిత రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. ప్రభుత్వం విద్యా నాణ్యత పెంపునకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి పాఠశాలలో విద్యార్థుల అభ్యాస ఫలితాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని ఎంఈఓ-1 పేర్కొన్నారు.

## మందుబాబులకు అడ్డాగా కొత్తపల్లి జంక్షన్

కరీంనగర్ :కొత్తపల్లి జంక్షన్ ప్రాంతం రాత్రి వేళల్లోమందుబాబులకు అడ్డాగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం చీకటి పడిన వెంటనే కొందరు వ్యక్తులు జంక్షన్ వద్ద గుంపులుగా చేరి మద్యం సేవిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. మద్యం సేవించిన అనంతరం బీరు సీసాలను రోడ్డుపైనే పగులగొడుతూ, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో ఆమార్గంలో ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా, రోడ్డుపై పగులగొట్టిన బీరు సీసాల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది వ్యక్తులు బహిరంగంగానే మద్యం సేవించడం వల్ల స్థానిక ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని పేర్కొంటున్నారు.

## షాబాద్ మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం

### ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ.. - పలువురికి గాయాలు

రంగారెడ్డి : చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్ మండల పరిధి నాగర్గూడ గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన ఓ లారీ ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో పలువురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికులు వెంటనే నాగర్గూడలోని శ్రీనివాస ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రమాద విషయం తెలుసుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తనయుడు కాలే శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం..

## ఏపీలో సర్పంచ్ ఎన్నికల నిర్వాహణకు ఏర్పాట్లు

అమరావతి : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో వార్డుల విభజన, కోర్టు కేసుల స్థితి, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు తదితర అంశాలపై సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ముందుగా మున్సిపల్ ఎన్నికలు, అనంతరం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, చివరగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు సమాచారం. అన్ని ఎన్నికలను అక్టోబర్లోపు పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయి.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసిన టిడిపి నాయకులు

తుగ్గలి: తుగ్గలి మండల వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన తుగ్గలి నందు పత్తికొండ శాసనసభ్యులు కే.ఈ శ్యాంబాబు ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు,ఉపాధ్యక్షుడు వెంకట రాముడు చౌదరి,అల్లా బకాష్, మాజీ ఎంపిటిసి వల్లే వెంకటేష్, కృష్ణయ్య లు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. అదేవిధంగా మండల పరిధిలోని గల బొందిమడుగుల గ్రామం నందు కేయీ శాంబాబు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్చార్జి ప్రతాప్ యాదవ్,సొసైటీ డైరెక్టర్ మోహన్,బూత్ ఇన్చార్జిలు వీరేంద్ర, నరేష్ లు సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఇంటింటికి తిరిగి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు టిడిపి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## కొలిమిగుండ్లలో నాలుగు గుండ్ల ఆలయం పునరుద్ధరణ పనులు ప్రారంభం

కొలిమిగుండ్ల : కొలిమిగుండ్ల గ్రామ సమీపంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, బిసి. ఇందిరమ్మ దంపతుల ఆదేశాల మేరకు కొలిమిగుండ్ల టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి సహకారంతో పూర్వ సంపద రక్షణ, సంపద సేన వారి ఆధ్వర్యంలో కొలిమిగుండ్ల గ్రామస్తులు కలిసి నాలుగు గుండ్ల ఆలయ పునరుద్ధరణ పనులను ఘనంగా ప్రారంభించారు. నాలుగు గుండ్ల ఆలయాన్ని పూర్వం శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించారని గ్రామస్తులు తెలిపారు. ఈ ఆలయం చుట్టూ ముళ్ళ పొదలు ఏర్పడి ఉండడంతో వాటిని జెసిబి సహాయంతో తొలగించి ఆలయం చుట్టూ ప్రహరి గోడ నిర్మించి ఆలయ ప్రాంగణంలో గ్రావెల్ మట్టి తోలించి ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఒకప్పుడు ఈ ఆలయంలోకి వెళ్లాలంటే గ్రామ ప్రజలు భయపడే విధంగా ఉండేది. ప్రస్తుతం ఈ ఆలయ పనులను పున ప్రారంభించడంతో కొలిమిగుండ్ల టిడిపి మండల అధ్యక్షుడుకి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే నాలుగు గుండ్ల ఆలయంలో పూజా కార్యక్రమాలు కూడా ప్రారంభమవుతాయని గ్రామ టిడిపి కార్యకర్త లోకేపల్లె మధు ప్రసాద్ రెడ్డి అన్నారు.


# కరీంనగర్ లో గల్లీగల్లీని అభివృద్ధి చేస్తా

### - కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



కరీంనగర్ : కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని గల్లీగల్లీని అభివృద్ధి చేస్తానని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు తన పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొస్తానని స్పష్టం చేశారు. కరీంనగర్ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, పరామర్శలతో బిజీబిజీగా గడిపారు. ఉదయం 9 గంటలకు తన నివాసం వద్దకు వచ్చిన సందర్శకులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్న బండి సంజయ్ ఆ తరువాత 10.30 గంటలకు స్థానిక కార్పొరేటర్లు, బీజేపీ నాయకులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తొలుత 48వ డివిజన్ లోని విద్యానగర్ కురుమవాడలో కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తోపాటు స్థానిక కార్పొరేటర్ కర్ర పద్మ అనిల్ తో కలిసి కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ నిధుల్లో రూ.80 లక్షలు యూఐడీఎఫ్ నిధులు కాగా, మిగిలిన రూ.20 లక్షలు మున్సిపల్ సాధారణ ఫండ్ కు సంబంధించినవి. అనంతరం 19వ డివిజన్ లోని రేకుర్తి ముదిరాజ్ కాలనీకి వెళ్లిన కేంద్ర మంత్రి రూ.40 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు, పైప్ లైన్ పనులకు బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. అట్లాగే లక్ష్మీ నరసింహ కాలనీలో రూ.57 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు, పైప్ లైన్ పనులకు శ్రీకారం చుట్టారు. అక్కడి నుండి మొగ్దుంపూర్ వెళ్లిన కేంద్ర మంత్రి రూ.10 లక్షల జాతీయ ఉపాధి హామీ నిధులతో నిర్మించిన మహిళాశక్తి ధరణి గ్రామైఖ్య సంఘ భవనాన్ని స్థానిక సర్పంచ్ శివకుమార్ తో కలిసి ప్రారంభించారు. అట్లాగే రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్ ను ప్రారంభించారు. అంతకుముందు చింతకుంట వెళ్లిన కేంద్ర మంత్రి బండి సంజయ్ అంబేద్కర్ భవన్ సమీపంలో నిర్వహించిన 'వన మహోత్సవం-2026 లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కు అధికారులతోపాటు మహిళలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. వారితో కలిసి స్వయంగా మొక్కలను నాటారు. మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్, అధికారులు సైతం మొక్కలు నాటారు. అనంతరం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ లోని ప్రతి గల్లీగల్లీని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. ముఖ్యంగా అభివృద్ధికి అంతగా నోచుకోని నగర శివారు గ్రామాల్లోని గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మిస్తాం. అందుకోసం కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తాం. ఇప్పటికే స్మార్ట్ సిటీ కింద 900 కోట్ల రూపాయల నిధులను తీసుకొచ్చి కరీంనగర్ ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దినం. ఇవిగాకుండా అమ్రుత్ 1, 2 కింద 279 కోట్ల రూపాయలు ఖర్చు చేసినం. అట్లాగే అర్బన్ డెవలెప్ మెంట్ ఫండ్ కింద రూ.50 కోట్లు వచ్చినయ్. వాటితో గల్లీల్లో రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినం. తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణం కోసం కేంద్రమే పూర్తిగా 156 కోట్లను మంజూరు చేసింది. శరవేగంగా పనులు జరుగుతున్నాయి. తాజాగా 840 కోట్ల యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ కార్పొరేషన్ రూపురేఖలే మారబోతున్నాయి. కరీంనగర్ లో మోడల్ రోడ్లను నిర్మిస్తాం. స్కై వాక్ లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను నిర్మిస్తాం, నాన్ మోటరైజ్డ్ ట్రాన్స్ పోర్ట్ మోటార్, ఇంధనం ఉపయోగించే రవాణా వాహనాలు వాహనాలను అందు బాటులోకి తీసుకొస్తాం. కరీంనగర్ శివారు ప్రాంతాల్లోని గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మిస్తాం. అభివృద్ధిలో తెలంగాణ లోనే కరీంనగర్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడంతోపాటు సుందర నగరంగా మార్చబోతున్నాం. కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు తనకు ఓట్లేసి గెలిపించిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు శాయశక్తులా క్రుషి చేస్తున్నా. అందుకోసం నా పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే రూ.22 వేల కోట్లు నిధులు ఖర్చు పెట్టిన. పలు అభివృద్ధి పనులు చేసిన. త్వరలోనే వివిధ కేంద్ర పథకాల కింద మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నా.

# ఇప్పుడు అదిలాబాద్ ఎయిర్ పోర్టు క్రెడిట్ వార్



అదిలాబాద్ : ఏపీలో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ప్రారంభం కాగా, దీనిపై కూటమి ప్రభుత్వం, వైఎస్సార్ సీపీ ఇది తమ ఘనతేనని క్లెయిమ్ చేస్తున్నాయి. తమ హయాంలోనే దాదాపు ఎయిర్ పోర్ట్ పనులు పూర్తికాగా, సీఎం చంద్రబాబు ఫినిషింగ్ వర్క్స్ పూర్తి చేశారని వైసీపీ అంటోంది. తాము ఏది సాధించినా క్రెడిట్ తమ ఖాతాలో వేసుకోవడం వైసీపీకి అలవాటు అయిందంటూ కూటమి నేతలు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ విషయంలోనూ క్రెడిట్ గేమ్ మొదలైంది. సాధించింది తామేనని బీజేపీ నేతలు చెబుతంటే, బీజం వేసింది తానేనని, మంజూరు చేసింది కాంగ్రెస్ పార్టీ అని మాజీ ఎంపీ సోయం బాపూరావు వ్యాఖ్యానించారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ మంజూరు, పనులకు అనుమతులపై మాజీ ఎంపీ సోయం బాపూరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిలాబాద్ లో ఎయిర్ పోర్ట్ మంజూరు చేసింది కాంగ్రెస్ పార్టీనే అని, దానికి గతంలో బీజం వేసింది తానేనని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు హాజరయ్యారు. ముందుగా గ్రామనికి చేరుకున్న నాయకులకు స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం పార్టీ బలోపేతం కోసం దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ సోయం బాపూరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కృషితో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నాలతో ఆదిలాబాద్ జిల్లా కు ఎయిర్ పోర్ట్ మంజూరు అయ్యిందన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడే ఆదిలాబాద్ జిల్లాకు విమానాశ్రయం కోసం అప్పటి కేంద్ర మంత్రులకు ప్రధానికి వినతిపత్రాలు ఇచ్చానని, అంటే ఈ ఎయిర్‌పోర్ట్ కోసం ముందస్తుగా బీజం వేసింది తానేనని గుర్తు చేశారు. దానికి సాక్షం బీజేపీ ఎమ్మెల్లే పాయల్ శంకర్ అన్నారు. కానీ స్థానిక ఎమ్మెల్లే, బీజేపీ నాయకులు తామే ఆదిలాబాద్ కు విమానాశ్రయం తెచ్చింది తామేనని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ చేస్తే స్థానిక ఎమ్మెల్లే శంకర్ తానే చేస్తున్నానని చెప్పడం విడ్డూరంగా ఉ ందన్నారు. కాంగ్రెస్ పార్టీ రేషన్ కార్డులు ఇచ్చిందని, రైతులకు రుణమాఫీ చేసిందన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ప్రయాణం కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని దీన్ని పార్టీ కార్యకర్తలు ప్రజల వద్దకు తీసుకెళ్లి వివరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యేను ఓడగొట్టడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కార్యకర్తలు సైనికుల్లా పని చెయ్యాలని పిలుపునిచ్చారు

# వనపర్తి శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

### అనుమతి లేని సభలు, ర్యాలీలపై కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ సునిత రెడ్డి

వనపర్తి : ఆజిల్లాలో శాంతిభద్రతలను మరింత పటిష్టంగా కొనసాగించడం, ప్రజల సాధారణ జీవనానికి ఎలాంటి అంతరాయం కలగకుండా చూడడం, అవాంఛనీయ సంఘటనలను ముందస్తుగా నివారించడం లక్ష్యంగా ఆగస్టు 31 వరకు "30 పోలీస్ యాక్ట్-1861" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీమాట్లాడుతూ. జిల్లా పరిధి లో ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించే అవకాశ మున్న ఎలాంటి కార్యక్రమమైనా సంబంధిత పోలీసు ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా నిర్వహించరాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ధర్నాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, నిరసన కార్యక్రమాలు, భారీ స్థాయి సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించడం పూర్తిగా నిషేధమని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను పోలీసులు ఏమాత్రం ఉపేక్షించబోరని, "30 పోలీస్ యాక్ట్" నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజల భద్రత, ప్రశాంతత మరియు సామాజిక శాంతిని పరిరక్షించడమే ఈ నిబంధనల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఏ సంస్థ, సంఘం లేదా వ్యక్తి బహిరంగ కార్యక్రమాలు నిర్వహించదలచినట్లయితే సంబంధిత పోలీసు అధికారులను ముందుగానే సంప్రదించి అనుమతి పొందాలని సూచించారు. చట్టాలను గౌరవించడం ప్రతి పౌరుని బాధ్యత అని, ప్రజల సహకారంతోనే జిల్లాలో ప్రశాంత వాతావరణాన్ని మరింత బలోపేతం చేయగలమని ఎస్పీ తెలిపారు. ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి ధన్యవాదాలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ : గౌరవెల్లి ప్రాజెక్టుతో పాటు పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్ ప్రాజెక్టులకు గతంలో మంజూరైనపర్యావరణ అనుమతులను కొనసాగిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూతెలంగాణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం తో సంప్రదింపులు జరుపుతూ, అభిషేక్ సింగ్వి లాంటి మంచి న్యాయవాదులను నియమించి సుప్రీంకోర్టు లో న్యాయపరంగా సమర్థవంతంగా పోరాడిన ఫలితంగానే ఈ తీర్పు వచ్చిందన్నారు. గౌరవెల్లి, పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకుఈ తీర్పు కొత్త ఊపునిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తాగునీటి అవసరాలు కూడా తీరనున్నాయని, రైతులకు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఇవి ఎంతో దోహదపడతాయని మంత్రి తెలిపారు. తెలంగాణహక్కులను పరిరక్షించడంలోముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న చొరవ,ప్రభుత్వంచేసిన న్యాయపోరాటంరాష్ట్ర ప్రయోజనాలను కాపాడిందనిమంత్రి పొన్నంప్రభాకర్ అభినందించారు.

## నీటి చెరువులలో పశు గ్రాసాల పెంపకంకు ఉచిత పశు గ్రాసాల విత్తనాల సరఫరా

తుగ్గలి: కరువు నివారణ చర్యలలో భాగంగా తుగ్గలి మండల పరిధిలోని గల ముక్కెళ్ల, రాంపల్లి,ఎద్దులదొడ్డి గ్రామంలోని పాడి రైతులు వేసిన జొన్న మరియు మొక్కజొన్న పశుగ్రాసల పొలాలను చూసి వారికి పశుగ్రాసాల అవశ్యకత గురించి డా.లక్ష్మన్న,సహాయ సంచాలకులు,పత్తికొండ వారు అవగాహన కల్పించారు. ఇందులో ముఖ్యంగా రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆదేశాల మేరకు, తుగ్గలి మండలం లోని నీటి చెరువులలో పశు గ్రాసాల పెంపకం గురించి వివరించి ఈ పథకం ద్వారా గ్రామాల లోని నీటి చెరువులలో పశు గ్రాసాలు పెంపకం చేయడానికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారు వంద శాతం ఉచితంగా జొన్న మరియు మొక్కజొన్న పశుగ్రాసవిత్తనాలను పాడిరైతులకు సరఫరా చేయబడును. మండలం లోని పాడి రైతులు తమ గ్రామ పంచాయతీ లోని నీటి చెరువులలో కలిసి కట్టుగా పశు గ్రాసాలు పెంపకం చేయడానికి ముందుకు వస్తే తాము వంద శాతం ఉచితంగా జొన్న మరియు మొక్కజొన్న పశుగ్రాస విత్తనాలను పాడిరైతులకు సరఫరా చేస్తామని వారు తెలియజేశారు. పాడి రైతులకు తమ వ్యక్తిగత పొలాలలో వేసుకోవడానికి పశుగ్రాస విత్తనాలను 75% సబ్సిడీతో అందజేయుచున్నారని,అలాగే బహువర్షిక పశు గ్రాసాలు పెంచుకునుటకు ఉపాధి హామీ పథకం వారి ఆర్థిక సహాకారంతో ఒక ఎకరాకు యాభై ఆరువేల రూపాయలు రెండు సంవత్సరాలకు గాను పాడి రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్నారని వారు తెలియజేశారు. ఈ పశుగ్రాస పంటల సాగు ద్వారా తక్కువ నీటితో అధిక పశుగ్రాస ఉత్పత్తి సాధ్యమవుతుందని అలాగే పశువులకు పోషకాహార విలువలు గల మేత అందుబాటులో ఉండుట వలన పాల ఉత్పత్తి పెరుగుటకు దోహదపడునని,కరువు పరిస్థితుల్లో పాడి రైతులకు ఇది ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని వారు తెలియజేశారు. తుగ్గలి మండలంలోని పాడి రైతులు కరువు నివారణ పశు గ్రాసాలభద్రత కోసం నీటి చెరువులలో సామూహిక పశు గ్రాసాల పెంపకం,పశు గ్రాస విత్తనాలను 75% సబ్సిడీతో మరియు ఉపాధి హామీ పథకం హరిత గోపాలం పథకం ద్వారా తమ వ్యక్తిగత పొలాలలో పశు గ్రాసాలు పెంచుకోవాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో లో ముక్కెళ్ల,రాంపల్లి, ఎద్దులదొడ్డి గ్రామ పాడి రైతులు ముని స్వామి,శ్రీనివాసులు, రంగస్వామి, ఓబులేసు, బాలప్ప,శివ మరియు పశు వైద్య సహాయ సిబ్బంది శంకరయ్య,వంశి,షాహినా తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల రికార్డులను తనిఖీ చేసిన ఎంఈఓ ఖాసిం

పిడుగురాళ్ల :పిడుగురాళ్ల లోని రసూల్ పేటలో గల మండల ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి ఎండి. ఖాసిం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు మరియు రికార్డులను పరిశీలించారు. పాఠశాల రికార్డులు పక్కాగా ఉండాలని, విద్యార్థి అడ్మిషన్ను తీసుకున్న తర్వాత అడ్మిషన్ బుక్ లో విద్యార్థి ఆధార్, తల్లి మరియు తండ్రి యొక్క వివరాలు, పుట్టిన తేదీ యొక్క వివరాలు పారదర్శకంగా పూర్తి చేయాలని అన్నారు. భవిష్యత్తులో రికార్డు పరంగా విద్యార్థికి ఎటువంటి తేడా లేకుండా చూడాలని అన్నారు. లీప్ యాప్ త్వరగా డౌన్లోడ్ చేయించాలని దాని ద్వారా తల్లిదండ్రులకు కలిగే ప్రయోజనాలను వారికి వివరించాలని ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయు లకు సూచించారు.

## గ్రామాల పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం

తుగ్గలి: గ్రామాల పరిశుభ్రతతో ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీడీవో విశ్వమోహన్,డిప్యూటీ ఎంపీడీవో శ్రీహరిలు తెలియజేశారు. గ్రామాల పరిశుభ్రతే ప్రజల ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని,ఇంటి పరిసరాల పరిశుభ్రత,వీధులలో శుభ్రత ఆ గ్రామ సంపదకు మొదటి మెట్టుగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. తుగ్గలి మండలంలోని జొన్నగిరి,సూర్య తాండ,ఉప్పర్లపల్లి, పగిడిరాయి గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత, తడి చెత్త - పొడి చెత్త నిర్వహణ, బిన్- బ్యాగ్ సిస్టం గురించి ప్రజలలో అవగాహన వారు అవగాహన కల్పించారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు తప్పనిసరిగా వర్మీ ఉత్పత్తి చేయాలని,చెత్తను వేరుచేసి ఎరువుగా ఉపయోగించే వాటిని వేరుగా,పొడి చెత్తను స్వచ్ఛరథానికి అప్పగించి ఇళ్ళకు కావలసిన చిన్నపాటి సరుకులు పొందాలని వారు ప్రజలకు తెలియజేశారు. అదే విధంగా పిడిఓలు అన్ని గ్రామాలలో ప్రజలలో తప్పనిసరిగా తడి చెత్త - పొడి చెత్త,బిన్-బ్యాగ్ సిస్టం గురించి పూర్తిస్థాయి అవగాహన వచ్చేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్లు రాజు నాయక్,శరన్ నాయక్, త్రివిక్రమ్,ముంతాజ్ బేగం,రాజమణి ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు లేక ఎండిపోయిన పంటలు

**- మూగజీవాల పరిస్థితి చాలా దారుణం**

**- ప్రతి రైతు కుటుంబానికి రూ.20 వేలు ఇవ్వాలి**

**- సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య**

తుగ్గలి : వర్షాలు లేక ఎండిపోయిన పంట పొలాలతో కరువు తాండవిస్తుందని, అన్నదాతలు అప్పుల ఊబిలో చిక్కుకుపోయారని సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య తెలియజేశారు. శనివారం రోజున తుగ్గలి మండలంలోని పలు గ్రామాల్లో ఎండిపోయిన పంటలను సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతు కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులు చెల్లించిన పంటల బీమా ప్రీమియం ను ప్రభుత్వమే భరించి, ఇప్పటికే రైతులు చెల్లించిన ప్రీమియం మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో తిరిగి జమ చేయాలని కోరారు. అలాగే కరువు కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతి రైతు కుటుంబానికి ఆరు నెలల పాటు నెలకు రూ.20,000 చొప్పున ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న వ్యవసాయ రుణాలను పూర్తిగా మాఫీ చేయడంతో పాటు,పంట నష్టానికి ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 3న అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట రైతులతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. రాజకీయాలకు అతీతంగా రైతు సోదరులంతా ఈ ఉద్యమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్ర,సీపీఐ జిల్లా నాయకుడు రాజా సాహెబ్,జిల్లా సమితి సభ్యుడు రోల్లపాడు వెంకటేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మారుతున్న రాజకీయాలు

ఒకప్పుడు రాజకీయాల్లో ప్రజల మనసు గెలవాలంటే పాదయాత్రే ప్రధాన ఆయుధంగా ఉండేది. వేల కిలోమీటర్లు నడిచి ప్రజల సమస్యలు తెలుసుకోవడం ద్వారా నాయకులు తమ రాజకీయ ప్రస్థానాన్ని బలోపేతం చేసుకునేవారు. కానీ కాలం మారుతోంది? రాజకీయ కమ్యూనికేషన్ కూడా మారుతోంది. ఇప్పుడు జాబ్ మేళాలు, మెడికల్ క్యాంపులు, మహిళా సమావేశాలు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరువ కావడం వంటి కొత్త పద్ధతులు రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. మరి నిజంగానే పాదయాత్రల యుగానికి ప్రత్యామ్నాయం వచ్చిందా?తెలుగు రాష్ట్రాల్లో గత రెండు దశాబ్దాలుగా పాదయాత్రలు రాజకీయ విజయానికి కీలక వ్యూహంగా నిలిచాయి. 2003లో వై.ఎస్. రాజశేఖర రెడ్డి చేపట్టిన పాదయాత్ర, ఆ తర్వాత చంద్రబాబు నాయుడు నిర్వహించిన "వస్తున్నా మీ కోసం", వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన "ప్రజా సంకల్ప యాత్ర" వంటి కార్యక్రమాలు రాజకీయంగా పెద్ద మైలురాళ్లుగా నిలిచాయి. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడానికి ఇవి సమర్థమైన వేదికలుగా మారాయి.అయితే ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సోషల్ మీడియా విస్తరణతో నాయకుడు ఒక గ్రామంలో చేసిన కార్యక్రమం క్షణాల్లోనే లక్షల మందికి చేరుతోంది. దీంతో ప్రజలను కలవడానికి పాదయాత్ర ఒక్కటే మార్గం కాదనే భావన బలపడుతోంది. ఇక ప్రజల అంచనాల్లో కూడా మార్పు కనిపిస్తోంది. "ఎంత నడిచారు?" అనే ప్రశ్న కంటే "ఏం చేశారు?" అనే ప్రశ్నకు ఇప్పుడు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. ముఖ్యంగా యువత ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం, విద్య వంటి అంశాలపై నాయకుల చర్యలను గమనిస్తోంది. అందుకే రాజకీయ నాయకులు కూడా సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో నిరంతర ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.ఇటీవలి కాలంలో మెగా జాబ్ మేళాలు, ఉచిత వైద్య శిబిరాలు, మహిళా సంఘాలతో సమావేశాలు, రైతు అవగాహన సదస్సు లు, స్కిల్ ట్రైనింగ్ క్యాంపులు, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు వంటి కార్యక్రమాలు విస్తృతంగా కనిపిస్తున్నాయి. ఇవి ఏ ఒక్క పార్టీకి మాత్రమే పరిమితం కాకుండా వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు అమలు చేస్తున్న కార్యక్ర మాలుగా మారుతున్నాయి.అదే సమయంలో ప్రచార విధానంలో కూడా గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు పోస్టర్లు, భారీ బహిరంగ సభలు ప్రధాన ప్రచార సాధనాలైతే, ఇప్పుడు రీల్స్, షార్ట్ వీడియోలు, లైవ్ స్ట్రీమింగ్, డిజిటల్ కమ్యూనికేషన్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. స్థానిక స్థాయిలో చిన్న సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలతో నిరంతర సంబంధాన్ని కొనసాగించే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. అయితే రాజకీయ విజయాన్ని ఒక్క అంశంతోనే ముడిపెట్టలేమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. పార్టీ బలం, అభ్యర్థి వ్యక్తిత్వం, స్థానిక పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, ఎన్నికల సమయంలో నెలకొనే రాజకీయ వాతావరణం వంటి అనేక అంశాలు కలిసి ఫలితాలను ప్రభావితం చేస్తాయి.భారతదేశంలో డిజిటల్, సోషల్ మీడియా విస్తరణ నేపథ్యంలో, ప్రజా చర్చ మరియు ప్రజాభిప్రాయ స్వయంప్రతిపత్తి సవాలుకు గురయ్యాయి. భారతదేశపు 2019 సార్వత్రిక ఎన్నికలు, నిజమైన డిజిటల్ వినియోగ సమాజంలో జరిగిన మొట్టమొదటి జాతీయ ఎన్నికలు. ఈ ఎన్నికలలో, ఓటర్లలో సుమారు సగం మందికి డిజిటల్ మార్గాలు అందుబాటులో ఉండగా, మరో మూడో వంతు మందికి సోషల్ మీడియా అందుబాటులో ఉంది. ప్రపంచ పోకడకు అనుగుణంగా, భారతీయ రాజకీయ నాయకులు తమ మద్దతుదారులతో నేరుగా మమేకమవ్వడానికి, రోజువారీ రాజకీయ సంభాషణల కోసం సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. జిటల్ వేదికలపై కార్యకలాపాలను, అలాగే అవి విస్తృత రాజకీయ సమీకరణ నుండి ఏ విధంగా విడదీయరానివిగా ఉన్నాయో విశ్లేషిస్తుంది.ఔజూలోని దక్షిణాసియా అధ్యయనాల సంస్థ మరియు కొన్రాడ్ అడెనార్ స్టిఫ్టుంగ్ నిర్వహించిన ఒక వర్క్‌షాప్‌లో ఈ పత్రాల ముసాయిదా ప్రతులు సమర్పించబడ్డాయి."ప్రధాన మీడియా స్రవంతిని బీజేపీ తన నియంత్రణలోకి తీసుకుంది" అని కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం హెడ్ సుప్రియా శ్రీనేత్ అన్నారు.మా నిధులను స్తంభింపచేశారు. ప్రకటనలపై ఖర్చు పెట్టేందుకు మా దగ్గర డబ్బులు లేవు" అని ఆమె అన్నారు. ఎన్నికలకు ముందుగా ఆదాయపు పన్ను విభాగం తీసుకున్న చర్యల గురించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం రాజకీయ ప్రతీకారం తీర్చుకుంటోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే, దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా పనిచేస్తున్నాయని, దీనిలో తమ పాత్రేమీలేదని ప్రభుత్వం అంటోంది."ఇలాంటి ఇబ్బందుల నడుమ ఓటర్లను చేరుకునేందుకు ఇన్‌ఫ్లూయెన్సర్లు వారధిలా పనిచేస్తున్నారు. మా పార్టీ సిద్ధాంతాలపై విశ్వాసం ఉండేవారితోపాటు మా వర్క్‌ను సోషల్ మీడియాలో షేర్ చేయాలనుకునేవారితో మేం కలిసి పనిచేస్తున్నాం" అని ఆమె చెప్పారు.సోషల్ మీడియాను ప్రజాస్వామ్యీకరించడంలో ఇన్‌ఫ్లూయెన్సర్లు సాయం చేస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మాజీ పొలిటికల్ అడ్వైజర్ అంకిత్ లాల్ అన్నారు.ద దేశ్‌భక్త్ యూట్యూబ్ చానెల్ నడిపే మాజీ జర్నలిస్టు ఆకాశ్ బెనర్జీ మాట్లాడుతూ ఇన్‌ఫ్లూయెన్సర్లు తమ హద్దులను చెరిపేసుకుంటూ ఒక్కో అడుగు ముందుకు వెళ్తున్నారని చెప్పారు.జర్మనీ నుంచి యూట్యూబ్ చానెల్ నడిపిస్తున్న ధ్రువ్ రాఠీ తాజాగా చేసిన 'ఈజ్ ఇండియా బికమింగ్ ల డిక్టేటర్‌షిప్?' వీడియోను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఆ వీడియోకు ఇప్పటివరకూ 24 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. దీనిపై ప్రభుత్వం స్పందించలేదు.'ఆ వీడియో తర్వాత డిక్టేటర్‌షిప్ అనే పదంపై చాలా చర్చ కొనసాగింది. ఇలా జరగడం నేను ముందెన్నడూ చూడలేదు" అని బెనర్జీ అన్నారు. ఇన్‌ఫ్లూయెన్సర్స్‌గా మా పని కేవలం కిటికీ తెరిచి వర్షం పడుతుందో లేదో చూడటం మాత్రమే కాదు. నీలి మేఘాలు కమ్ముకుంటున్నప్పుడు, ఓటింగ్ ద్వారా మీరు వాటిని తొలగించొచ్చని ప్రజల్లో చైతన్యం కల్పిం చడం మా బాధ్యత" అని ఆయన చెప్పారు.2029 ఎన్నికల్లో మరోసారి భారీ పాదయాత్రలే ప్రధాన అస్త్రంగా మారతాయా? లేక జాబ్ మేళాలు, సేవా కార్యక్రమాలు, డిజిటల్ కమ్యూనికేషన్, ప్రజలతో నిరంతర అనుబంధమే కొత్త రాజకీయ ఫార్ములాగా నిలుస్తుందా? దీనికి సమాధానం భవిష్యత్తులోనే తేలనుంది. అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది? ప్రజలతో అనుసంధానమయ్యే పద్ధతులు మారుతున్నాయి? వాటికి అనుగుణంగా రాజకీయాలు కూడా కొత్త రూపాన్ని సంతరించుకుంటున్నాయి.

# కాంగ్రెస్ తో కటీఫ్... మల్లన్న యాక్షన్ ప్లాన్ రెడీ



హైదరాబాద్ : చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న ఇప్పుడు తన రాజకీయ ప్రయాణంలో అత్యంత కీలకమైన సవాలును ఎదుర్కొంటున్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన వరంగల్ ఖమ్మం నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం ఆ పార్టీతో తెగదెంపలు చేసుకుని సొంత రాజకీయం మొదలుపెట్టారు. వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న తన పదవీకాలం ముగిసేలోపు మళ్లీ అదే స్థానం నుంచి స్వతంత్ర వేదిక ద్వారా గెలవాలనే లక్ష్యంతో సుదీర్ఘ పాదయాత్రకు రూపకల్పన చేస్తున్నారు. ఈ కొత్త నిర్ణయం ఆయన భవిష్యత్తును పూర్తిగా మార్చే అవకాశం ఉంది.గతానికి ఇప్పటికి మల్లన్న పొలిటికల్ ఇమేజ్‌లో చాలా స్పష్టమైన మార్పు వచ్చింది. ఒకప్పుడు తీన్మార్ మల్లన్న అంటే డిజిటల్ మీడియా ద్వారా ప్రభుత్వాలను అక్రమాలను ప్రశ్నించే హార్డ్‌కోర్ వాయిస్‌గా యూత్‌లో విశేషమైన ఆదరణ ఉండేది. ఆ ప్లాట్‌ఫామ్ తెచ్చిపెట్టిన క్రేజ్‌తోనే ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినప్పుడే లక్షలాది ఓట్లు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆ తదనంతరం కాంగ్రెస్‌లో చేరి ప్రత్యర్థులను తట్టుకుని ఎమ్మెల్సీ పీఠాన్ని అధిరోహించగలిగారు. కానీ కాలక్రమేణా ఆయన అనుసరించిన విధానాలు మారడంతో ప్రజల్లో ఆయనపై ఉన్న సానుకూల దృక్పథం నెమ్మదిగా కరిగిపోతూ వచ్చింది.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత ఆయన ఎంచుకున్న రాజకీయ దారి ఆయన పునాదులనే కదిలించిందనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. బీసీ ఐక్యత పేరుతో కొన్ని వర్గాలను ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తూనే ఇతర కులాలను సమాజంలోని కొన్ని విభాగాలను తీవ్రంగా విమర్శిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఈ చర్యలు ఆయనకున్న న్యూట్రల్ ఎడ్యుకేటెడ్ ఓటర్ బేస్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. విద్యావంతులు గ్రాడ్యుయేట్లు ఓటేసే ఎమ్మెల్సీ నియోజకవర్గంలో వ్యక్తిగత దూషణల కంటే ఉద్యోగ ఉపాధి అవకాశాలకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. ఈ క్రమంలో మల్లన్న తన పాత ఇమేజ్‌ను పోగొట్టుకుని దారి తప్పిన నాయకుడిగా మిగిలిపోయారనే విమర్శలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి.రాబోయే ఎన్నికల్లో ఆయనకు కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలం ఓటు బ్యాంకు అండగా ఉండవు. ప్రధాన పార్టీలు ఈ విస్తృత నియోజకవర్గంపై పట్టు సాధించేందుకు క్షేత్రస్థాయి నుంచి పక్కా వ్యూహాలు అమలు చేస్తున్నాయి. కాంగ్రెస్ వైపు నుంచి అధికారిక అభ్యర్థి బరిలో ఉంటారు కాబట్టి పోటీ మరింత తీవ్రంగా ఉంటుంది. ఇలాంటి త్రిముఖ లేదా చతుర్ముఖ పోరులో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ లేకుండా కేవలం సొంత ఇమేజ్‌తో బరిలోకి దిగడం పెద్ద సాహసమే. అందుకే పాదయాత్ర ద్వారా మళ్లీ జనం లోకి వెళ్లి కోల్పోయిన నమ్మకాన్ని పునరుద్ధరించుకోవాలని ఆయన తీవ్రంగా భావిస్తున్నారు.పాదయాత్రలు చేయడం తేలికే అయినా పట్టభద్రుల మైండ్ సెట్‌ను మార్చడం మల్లన్నకు అంత సులభం కాకపోవచ్చు. ఒకవేళ పాదయాత్ర చేసినా కూడా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఓట్లు సాధించలేకపోతే గత కొన్నేళ్లుగా ఆయన చుట్టూ ఉన్న పొలిటికల్ హడావుడి ప్రహసనంలా మారుతుంది. తన పాత ఇమేజ్‌ను తిరిగి తెచ్చుకుని విద్యావంతులను మెప్పించే సరైన అజెండాతో వస్తే తప్ప రాబోయే ఎన్నికల పోరు ఆశాజనకంగా ఉండే అవకాశం లేదు. లేకపోతే ఆయనను పట్టించుకునే వారే కరువవుతారు.

# కాక్రోచ్ తరహాలో క్రిమినల్ వేస్ట్ పార్టీ?

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల ఉద్యోగార్హతలు, స్కిల్స్ లోపంపై మాట్లాడుతూ చేసిన క్రిమినల్ వేస్ట్ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర తుఫాను రేపాయి. ఏటా 1.10 లక్షల మంది ఇంజినీరింగ్ పట్టాలు పొందుతున్నా కనీసం ఒక ఉద్యోగ దరఖాస్తు కూడా సొంతంగా నింపలేకపోతున్నారని, ఇది విద్యావ్యవస్థ పరిధిలో క్రిమినల్ వేస్ట్ అని ఆయన వ్యాఖ్యానించడం విమర్శలకు దారితీసింది. ఈ కామెంట్లపై ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ తో పాటు బీజేపీ నేత ఈటల రాజేందర్ వంటి వారు యువతను కించపర్చారని రేవంత్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డిలు రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. సీఎం వెంటనే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రొఫెషనల్ అర్హతలు, కనీస పోటీ పరీక్ష రాసిన అనుభవం లేని సీఎం యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని ఆరోపిస్తూ, జెన్-జీ యువత , ఇంజినీరింగ్ విద్యార్థులు ఈ వ్యాఖ్యలపై తిరగబడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. డిజిటల్ మాధ్యమాల్లో రేవంత్ వ్యాఖ్యలపై విద్యార్థుల నిరసనను ఒక రాజకీయ ఉద్యమంగా మార్చేందుకు బీఆర్ఎస్, బీజేపీ సోషల్ మీడియా విభాగాలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. తాజాగా సోషల్ మీడియాలో కాక్రోచ్ అనే పదాన్ని ఒక విమర్శగా ఉపయోగించినప్పుడు, దాన్ని ప్రతిఘటిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఎలా పుట్టుకొచ్చిందో, సరిగ్గా అలాగే ఇప్పుడు రేవంత్ వ్యాఖ్యలను రీ-బ్రాండ్ చేస్తూ క్రిమినల్ వేస్ట్ అనే ట్యాగ్‌ను విద్యార్థులు ఒక నిరసన చిహ్నంగా మలుచునేలా చేసేందుకు రాజకీయ పార్టీలు ప్రోత్సాహం ఇస్తున్నాయి. మేము క్రిమినల్ వేస్ట్ కాము.. నవ తెలంగాణ నిర్మాతలము అనే హ్యాష్‌ట్యాగ్‌లు, మీమ్‌లు, షార్ట్ వీడియోలతో జెన్-జీ తీవ్రస్థాయిలో రీ-కౌంటర్లు ఇస్తోంది. ఈ భావోద్వేగాన్ని ప్రతిపక్షాలు క్యాష్ చేసుకోవడానికి క్రిమినల్ వేస్టే పార్టీ పెట్టేలా యువజన సమూహాలను ఆన్‌లైన్ వేదికగా ప్రోత్సహించేందుకు సిద్ధమవుతున్నాయి.భారత రాజకీయాల్లో ముఖ్యంగా పొలిటికల్ మీమ్‌లతో ఆడుకునే ప్రస్తుత జెన్-జీ తరం ఎప్పటికప్పుడు సరికొత్త నెరేటివ్‌లను సృష్టిస్తుంది. ఒక వివాదాస్పద పదాన్ని పట్టుకుని దాన్నే ఒక ఐడెంటిటీగా మార్చుకోవడం గ్లోబల్ డిజిటల్ ట్రెండ్. గతంలో కేటీఆర్, ఇతర నేతలు ఉపయోగించిన పదాలను కాంగ్రెస్ ట్రోల్ చేయగా, ఇప్పుడు కాంగ్రెస్ సీఎం వ్యాఖ్యలను బీఆర్ఎస్ అస్త్రంగా మార్చుకుంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై విద్యార్థులు ఆత్మగౌరవ నిరసనలు తెలుపడానికి ప్రతిపక్ష పార్టీలు వెనకుండి బ్యాకింగ్, టెక్నికల్ సపోర్ట్, ట్రెండింగ్ ప్రోత్సాహాన్ని అందించడం ఖాయంగా కనిపిస్తోంది.అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు ఉద్దేశం విద్యాసంస్కరణలేనని కాంగ్రెస్ వర్గాలు సమర్థిస్తున్నాయి. డిగ్రీలు ఉన్నా స్కిల్స్ లేని విద్యార్థులను తీర్చిదిద్దడానికి జర్మనీ, ఫిన్లాండ్ మోడల్స్‌లో మొదటి రెండేళ్లు బేసిక్ విద్య, చివరి రెండేళ్లు ప్రాక్టికల్ విదేశీ లాంగ్వేజెస్, అప్రెంటిస్‌షిప్ నైపుణ్యాలు ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వారు పేర్కొంటున్నారు. అయితే, విధానపరమైన లోపాన్ని ఎత్తిచూపే క్రమంలో వాడిన క్రిమినల్ వేస్ట్ అనే పదం కమ్యూనికేషన్ ఫెయిల్యూర్‌గా మారి, రాజకీయ ప్రత్యర్థులకు రాజకీయ ఆయుధంగా మారింది. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు జెన్-జీ అసంతృప్తిని క్రిమినల్ వేస్ట్ ఉద్యమంగా మార్చేందుకు ఎంత ప్రయత్నించినా, అది ఎంతకాలం మనుగడ సాగిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

### మనవరాలైన మైనర్ బాలికపై తాత అత్యాచారం

ములుగు : ములుగు జిల్లా వాజేడు మండలంలో అమానుష ఘటన వెలుగు చూసింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో.. తలుపులు వేసి 14 ఏళ్ల బాలికపై తాత మోడెం కృష్ణయ్య అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించి.. పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలోనే అనారోగ్యానికి గురవ్వగా, నానమ్మ బాలికను ఆసుపత్రికి తీసుకెళ్లింది. బాలిక గర్భం దాల్చిందని వైద్యులు చెప్పగా, బాలికను నిలదీసింది నానమ్మ. తాతయ్యే ఇలా చేశాడని మైనర్ బాలిక చెప్పడంతో.. కృష్ణయ్యను కుటుంబ సభ్యులు నిలదీసారు. అబార్షన్ చేపించి, పెళ్లి అయ్యే వరకు ఖర్చులు భరిస్తానని కృష్ణయ్య భరోసా ఇచ్చాడని బాలిక ఆరోపించింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వస్తున్నాయి.

# రేవంత్ బాటలో డీకే..





బెంగళూరు : ఎన్నికల సమయంలో వేసే రాజకీయ ఎత్తుగడలు, విమర్శలు వేరని.. రాష్ట్ర అభివృద్ధి, పరిపాలన విషయానికి వచ్చేసరికి కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయడమే నిజమైన రాజధర్మమని కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ నిరూపించారు. మైసూరులోని రామకృష్ణ విద్యాలయ ప్రాంగణంలో ప్రతిష్టాత్మక వివేకనంద స్మారక యూత్ సెంటర్ ప్రారంభోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీతో వేదిక పంచుకున్న డికేఎస్, సభాముఖంగా ప్రధానిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా వైరల్ అయ్యాయి."మా ప్రధాని మోదీ ఈ చారిత్రాత్మక వేడుకకు రావడం చాలా గర్వకారణం" అని కొనియాడారు. "రాష్ట్ర అభివృద్ధి విషయంలో మొత్తం కర్ణాటక మీతో నిలబడుతుంది. మనం అంతా కలిసి పనిచేద్దాం. కర్ణాటక అభివృద్ధి చెందితేనే దేశం కూడా వృద్ధి చెందుతుంది. సహకార సమాఖ్య స్ఫూర్తితో కర్ణాటకకు విశాల హృదయంతో సహాయం అందించి, ఆదుకోవాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, తనకు మాట్లాడేందుకు కేవలం ఐదు నిమిషాల సమయం మాత్రమే ఉందని, ప్రధాని మోదీ దేశ ప్రజలకు ఇచ్చే సందేశం చాలా కీలకమైనదని, కాబట్టి తన సమయాన్ని వృథా చేయబోనంటూ ఆయన వేదికపై గౌరవప్రదంగా ప్రసంగాన్ని ముగించడం, ఆ తర్వాత ప్రధాని మోదీ- డికేఎస్ ఒకరి చేయి ఒకరు పట్టుకుని ఆప్యాయంగా నడుచుకుంటూ వెళ్లడం మీడియాలో హైలైట్ అయ్యింది.రాజకీయాల్లో సైద్ధాంతిక విభేదాలు, విమర్శలు సహజమే అయినప్పటికీ, అధికారంలోకి వచ్చాక కేంద్రంతో వైరం పెట్టుకుంటే నిధుల కేటాయింపులు, మౌలిక వసతుల ప్రాజెక్టులు దెబ్బతిని చివరికి రాష్ట్రానికే తీవ్ర నష్టం జరుగుతుందనే పచ్చి నిజాన్ని డి.కె. శివకుమార్ గుర్తించారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, కేంద్రంతో సత్సంబంధాలు నెరపుతూ రాష్ట్ర ప్రయోజనాలను నెరవేర్చుకోవడమే ఉత్తమ మార్గమని ఆయన భావించారు. రాజకీయ వేదికలపై ప్రత్యర్థులుగా పోరాడినా, పాలనా వ్యవస్థలోకి రాజకీయాలను తీసుకురాకూడదనే ఒక స్పష్టమైన దృక్పథాన్ని ఈ పరిణామం ద్వారా ఆయన చాటిచెప్పారు.సరిగ్గా ఇదే తరహా పరిణతి కూడిన వ్యూహంతోనే తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కూడా మొదటి నుంచి పయనిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష రాజకీయ విమర్శలను పక్కనపెట్టి, రాష్ట్ర ప్రగతి , మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవనం, బడ్జెట్ నిధుల కోసం ప్రధాని మోదీని, కేంద్ర మంత్రులను పలుమార్లు కలసి వినతులు అందించారు. కేంద్రంతో మేము యుద్ధం చేయం.. రచ్చ చేయం.. కలసి పనిచేసి రాష్ట్రానికి రావాల్సిన హక్కులను సాధించుకుంటాం అనే ముక్కుసూటి పాలసీని రేవంత్ పాటించారు. ఇప్పుడు కర్ణాటకలో డి.కె. శివకుమార్ కూడా అదే రేవంత్ మోడల్‌ను అనుసరిస్తూ, పరిపాలనకు-రాజకీయాలకు మధ్య గీత గీసి ముందుకు సాగడం దక్షిణాది కాంగ్రెస్ పాలనలో సరికొత్త రాజకీయ సంస్కృతికి అద్దం పడుతోంది.

# ఇన్ స్టా బాటన నేతలు

న్యూఢిల్లీ : దేశ రాజకీయాల్లో ఇప్పుడు గాలి మారింది. ఒకప్పుడు ప్రెస్ మీట్లు, కరపత్రాలతో సాగిన రాజకీయం.. ఆ తర్వాత ఫేస్‌బుక్ కథనాలు, ఎక్స్ వార్లకు మారింది. కానీ ఇప్పుడు ఆ పాత వేదికలన్నీ బామ్మల కాలం నాటి ముచ్చట్లుగా మారిపోయాయి. పొలిటికల్ లీడర్లంతా ఇప్పుడు హుటాహుటిన ఇన్‌స్టాగ్రామ్ బాట పడుతున్నారు. కారణం ఒక్కటే.. ఓటర్లలో నిశ్శబ్దంగా పెద్ద శక్తులుగా మారుతున్న జెన్ జీ ఎక్స్ ను సమాచారం తెలుసుకోవడానికి వాడుకుంటున్నారు. ఫేస్‌బుక్‌కు అసలు గుడ్ బై చెప్పేశారు.

వారు రోజంతా పడికాపులు కాసేది కేవలం ఇన్‌స్టా రీల్స్, షార్ట్స్ లోనే. అందుకే ఇప్పుడు రాజకీయం నడవాలంటే కుడిచేతి బొటనవేలితో స్వైప్ చేసే రీల్స్ పవర్ కావాల్సిందేనని నేతలు డిసైడ్ అయ్యారు.విషయం ఎంత తీవ్రంగా ఉందంటే.. ఏకంగా ప్రధాని నరేంద్ర మోదీ కూడా జెన్ జీ భాషలోనే సంభాషించడానికి ఇన్‌స్టా వేదికగా ఫ్రంట్-కెమెరా సెల్ఫీ వీడియోలు , రీల్స్ పోస్ట్ చేయడం మొదలుపెట్టారు. 10.5 కోట్లకు పైగా ఫాలోవర్లతో డిజిటల్ స్పేస్‌లో ట్రెండ్ సెట్ చేస్తున్న ప్రధాని నుంచి మొదలుకొని, స్థానిక వార్డు మెంబర్ దాకా అందరూ ఇన్‌స్టా అల్గారిథమ్‌ను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ట్విట్టర్ అనేది కేవలం ప్రెస్ రిలీజ్ పోస్ట్ చేసుకునే ఆఫీస్ బోర్డుగా మారిపోగా.. ప్రచారాన్ని, వ్యక్తిత్వాన్ని వైరల్ చేసుకోవడానికి ఇన్‌స్టాగ్రామ్ ఒకే ఒక్క అస్త్రంగా మారింది. యువతను ఆకట్టుకోవాలంటే వారి మైండ్ సెట్‌కు తగ్గట్టుగా కంటెంట్ ఇవ్వాలనే ఉద్దేశంతో పొలిటికల్ వార్ రూమ్‌లు కూడా ఇప్పుడు పీఆర్ ఏజెన్సీలతో రీల్స్ ప్రాజెక్టులు డిజైన్ చేయిస్తున్నాయి. దశాబ్దాలుగా పొడుగాటి పంచెలు, మైకులు పట్టుకుని ఐదు పేజీల మైక్ ఉపన్యాసాలు దంచేసే పాతతరం రాజకీయ నేతలకు.. ఈ 15 సెకన్ల రీల్స్ లాజిక్ అర్థం కాక చమటలు పడుతున్నాయి. జెన్ జీని మెప్పించడం కోసం కెమెరా ముందుకొచ్చి నిలబడటం, కుర్రాళ్లతో కలిసి ట్రెండింగ్ ఆడియోలకు హావభావాలు ఇవ్వడం, నేరుగా ఫోన్ వంక చూస్తూ హేయ్ గైస్ " అని పలకరించడం.. పాపం మన పొలిటీషియన్లకు పెద్ద అగ్నిపరీక్షలా మారింది. సెల్ఫీ యాంగిల్ సరిగ్గా కుదరక, మాట్లాడే స్టైల్ మోతాదు మించడంతో అనేక మంది నేతల ప్రయోగాలు మీమర్స్ కి కడుపుబ్బ నవ్వించే డైలీ కంటెంట్‌గా మారిపోతున్నాయి.

మరోవైపు ఇన్‌స్టాగ్రామ్ అల్గారిథమ్ చాలా విచిత్రమైనది. అక్కడ గంభీరమైన రాజకీయ ప్రసంగాలు చెల్లవు. జెన్ జీకి నచ్చే సరదా స్లాంగ్ , పాప్ కల్చర్ ట్రెండ్స్, కట్-షార్ట్ ఎడిటింగ్ లేకపోతే ఆ రీల్‌ను క్షణాల్లో పైకి నెట్టేస్తారు. దీంతో పొలిటికల్ పార్టీల సోషల్ మీడియా వింగ్స్.. తమ లీడర్లను ఇన్‌ఫ్లుయెన్సర్లుగా మార్చేందుకు తంటాలు పడుతున్నాయి. ఏ నాయకుడు ఏ బ్రాండ్ టీషర్ట్ వేసుకున్నారు, ఏ కాఫీ షాప్‌లో కూర్చున్నారు, యువతతో కలిసి ఎలాంటి ఫన్నీ కౌంటర్లు వేశారనే కట్-షాట్స్ కోసం ఏకంగా కెమెరా టీమ్‌లను వెంటబెట్టుకుని తిరుగుతున్నారు. నాన్-స్టాప్ పొలిటికల్ పోరాటాల కంటే రీల్స్‌కు వచ్చే లైకులు, కామెంట్లు, షేర్లే ఇప్పుడు నాయకుల పవర్‌ను కొలిచే కొలమానంగా మారాయి.ఓటు బ్యాంకు కోసం లీడర్లు పడే తిప్పలు ఇప్పుడు కేవలం వీధుల్లో పాదయాత్రలకే పరిమితం కాలేదు.. ఇన్‌స్టా స్క్రీన్ల పైకి చేరాయి. జెన్ జీ ఓటర్లను ఆకట్టుకోవడానికి అలవాటు లేని పనులు చేస్తూ, కుర్రాళ్ల ట్రెండ్స్‌ను అనుకరిస్తూ రాజకీయ నాయకులు పడుతున్న ఆర్గానిక్ అవస్థలు సామాజిక మాధ్యమాల్లో రక్తికట్టిస్తున్నాయి. ఎంత కష్టమొచ్చినా సరే.. ట్రెండింగ్ లో లేకపోతే రాజకీయంలో ఉనికికే ప్రమాదమని గుర్తించిన నేతలు, అలవాటు లేని ఈ ఇన్‌స్టా దారిలో కిందామీదా పడుతూ పయనించక తప్పడం లేదు!

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతుల కొరత, పారిశుధ్య లోపాలు : బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతుల కొరత, పారిశుధ్య లోపాలపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆసుపత్రి ప్రాంగణంలో చెత్త, మురుగు నీరు, తెరిచి ఉన్న నీటి సంపు, బీర్ సీసాలు కనిపించడంతో ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించకపోతే వారంలోగా తామే స్వయంగా ఆసుపత్రిని శుభ్రం చేస్తామని బీఆర్ఎస్ నేత పొట్ట నరేందర్ యాదవ్ హెచ్చరించారు.శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బీఆర్ఎస్ నాయకుడు పొట్ట నరేందర్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త, మురుగు నీరు, అపరిశుభ్ర వాతావరణం, పనిచేయని మరుగుదొడ్లు చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో నీటి బోరు రెండేళ్లుగా పనిచేయడం లేదని, వాష్‌రూమ్‌లలో నీటి సౌకర్యం కూడా లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. హెల్త్ సెంటర్‌లోని నీటి సంపు తెరిచి ఉండి పురుగులతో నిండిపోవడంతో దోమలు వ్యాపించి డెంగ్యూ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా, గడువు ముగియడానికి కేవలం మూడు నెలలు మాత్రమే మిగిలి ఉన్న మందులను రోగులకు అందిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో బీర్ సీసాలు కనిపించడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని, దీనిపై అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్య శాఖ పనితీరు పూర్తిగా క్షీణించిందని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. ప్రజలకు కనీస వైద్య సదుపాయాలు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఒక వారం రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చిన బీఆర్ఎస్ నాయకులు... స్పందించకపోతే తమ స్వంత నిధులతో ఆసుపత్రిని శుభ్రం చేసి, బోరు వేయిస్తామని ప్రకటించారు.

### త్వరలో సీఎం రేవంత్ రెడ్డి యూఎస్, కెనడా పర్యటన

హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి ఈ నెలలో అమెరికా (యూఎస్), కెనడా దేశాల్లో పర్యటించనున్నారని సమాచారం. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సుమారు 10-15 రోజుల పాటు ఈ పర్యటన చేపట్టనున్నారని తెలిసింది. ఆయన వివిధ రంగాలకు చెందిన అంతర్జాతీయ బహుళ జాతి సంస్థల ప్రతినిధులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, సీఈఓలతో సమావేశమై రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక అవకాశాలు, ప్రభుత్వ విధానాలను వివరించి పెట్టుబడులు పెట్టాలని కోరనున్నారు.

# రంగనాథ్‌ను తప్పిస్తారా?



హైదరాబాద్: హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణల తొలగింపు లక్ష్యంగా ఏర్పాటైన హైడ్రా చుట్టూ న్యాయపరమైన ముళ్లకంప అల్లుకుంటోంది. కేవలం ఒక్క రోజు వ్యవధిలోనే లేదా ఒకరి తర్వాత ఒకరుగా ఏకంగా ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులు ఈ ఏజెన్సీ తీరుపై, దాని అధిపతి ఐపీఎస్ అధికారి ఎ.వి. రంగనాథ్ వైఖరిపై తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేయడం రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోంది. బుల్డోజర్ సంస్కృతి, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలకు దిగడం, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేయడం వంటి చర్యలపై న్యాయస్థానం చేసిన ఘాటు వ్యాఖ్యలు హైడ్రా భవిష్యత్తును ప్రశ్నార్థకంలోకి నెట్టాయి. లోతుకుంట భూ వివాదానికి సంబంధించిన కోర్టు ధిక్కరణ కేసులో రంగనాథ్‌ను వెంటనే పదవి నుంచి తప్పించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశించినంది. హైడ్రాను పౌరాణిక రాక్షస మృగంతో పోల్చిన న్యాయమూర్తి, తమను తాము సూపర్ కాప్స్ గా భావించుకోవడం చెల్లదని స్పష్టం చేశారు. కేవలం ఈ ఒక్క బెంచ్ మాత్రమే కాకుండా, ఇతర న్యాయమూర్తులు కూడా వేర్వేరు పిటిషన్లపై విచారణ సందర్భంగా నోటీసులు ఇవ్వకుండా చేపడుతున్న ఆకస్మిక చర్యలను, విచారణాధికారాల అతిక్రమణను తీవ్రంగా తప్పుబట్టారు. స్వయంగా కమిషనర్ రంగనాథ్ దాదాపు 62 కోర్టు ధిక్కరణ కేసుల్లో నిందితుడిగా ఉండటం న్యాయవ్యవస్థ తీవ్రంగా పరిగణించిన అంశంగా మారింది. హైడ్రా చేపట్టిన ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన డ్రీమ్ ప్రాజెక్టుగా, బ్రాండ్ హైదరాబాద్ పునరుద్ధరణగా ప్రచారం చేసుకున్నారు. ప్రారంభంలో ప్రజల నుంచి, పర్యావరణ వేత్తల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించినప్పటికీ, రోజువారీ కార్యకలాపాల్లో చట్టబద్ధమైన ప్రక్రియను పాటించకపోవడమే ప్రస్తుతం ఏజెన్సీకి గొడ్డలిపెట్టుగా మారింది. ప్రతిపక్షాల విమర్శల కంటే కూడా, న్యాయస్థానాలు వరుసగా ఇస్తున్న ప్రతికూల తీర్పులు, వ్యాఖ్యలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రాజకీయంగా, పాలనాపరంగా పెద్ద సవాలుగా పరిణమించాయిహైకోర్టు ఏకంగా సీఎస్‌ను ఉద్దేశించి న్యాయసమ్మతమైన ఆదేశాలను గౌరవించే అధికారిని నియమించండి అని స్పష్టమైన సూచన చేయడంతో ఇప్పుడు బంతి రేవంత్ రెడ్డి కోర్టులోకి చేరింది. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసి రంగనాథ్‌ను అదే పోస్టులో కొనసాగిస్తే, అది ప్రభుత్వం , న్యాయవ్యవస్థ మధ్య మరింత ఘర్షణ వాతావరణానికి దారితీసే ప్రమాదం ఉంది. అంతేకాకుండా, ప్రభుత్వం ఆశించిన హైడ్రా అసలు లక్ష్యం పక్కదారి పట్టి, కేవలం చట్టవిరుద్ధమైన ఏజెన్సీగా ముద్రపడే ప్రమాదముంది. ఈ పరిణామాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరితగతిన నిర్ణయం తీసుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎ.వి. రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించి, మరొక అధికారికి బాధ్యతలు అప్పగించడం ద్వారా కోర్టు ఆదేశాలను గౌరవించినట్లవుతుందని, అలాగే ఏజెన్సీపై పడిన మరకను చెరిపేసి చట్ట పరిధిలోనే ఆక్రమణలపై చర్యలు కొనసాగించవచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. రాబోయే రెండు మూడు రోజుల్లో హైడ్రా నాయకత్వ మార్పుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

రంగనాథ్ పనులకు ఫుల్ పబ్లిసిటీ

హైదరాబాద్ నగరంలో చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు లక్ష్యంగా ఏర్పాటైన హైడ్రా చేపట్టిన సంస్కరణల సత్ఫలితాలు ఇప్పుడు క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు దుర్గంధంతో అలమటిస్తూ, ఆక్రమణల కోరల్లో చిక్కుకుని మురుగు నీటి కుంటలా మారిన ఉప్పల్ నల్లచెరువు'.. నేడు కన్నులపండువగా, ఆహ్లాదకర మైన వాతావరణంతో పునరుజ్జీవం పోసుకుంది. చెరువును ఆధునీకరించి, సుందరీ కరించిన తీరుపై ఉప్పల్ నివాసితులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల నుంచి హైడ్రా కమిషనర్ రంగనాథ్ , సిబ్బందిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. కొన్నేళ్లుగా నల్లచెరువు పరివాహక ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు వేయడం, ప్లాస్టిక్ చెత్తతో నింపేయడం, అక్రమ నిర్మాణాలు వెలియడంతో చెరువు తన ఆస్తిత్వాన్ని కోల్పోయే స్థితికి చేరింది. వర్షం వస్తే చాలు పరిసర కాలనీలైన పీఏసీఎస్ కాలనీ, ఉప్పల్ ప్రధాన రహదారులు జలమయమయ్యేవి. ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించిన హైడ్రా, జీహెచ్‌ఎంసీతో కలిసి సమగ్ర కార్యాచరణను చేపట్టింది. చెరువు పరిధిలోని అక్రమ నిర్మాణాలను తొలగించడమే కాకుండా, టన్నుల కొద్దీ పూడిక, చెత్తాచెదారాన్ని స్వల్పకాలంలోనే తొలగించి చెరువు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచింది. చెరువులోకి మురుగునీరు నేరుగా చేరకుండా డైవర్షన్ ఛానెళ్లను ఏర్పాటు చేసి, గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించారు. చెరువు కట్టను బలపరిచి దాని చుట్టూ వాకింగ్ ట్రాక్, విద్యుత్ దీపాలు, సందర్శకుల కోసం సుందరమైన బెంచీలు, పచ్చదనంతో కూడిన ల్యాండ్‌స్కేపింగ్‌ను తీర్చిదిద్దారు. సాయంత్రం వేళల్లో ఉప్పల్ వాసులు, చిన్నారులు, వృద్ధులు ప్రశాంతంగా గడిపేందుకు ఈ ప్రాంతం ఒక అద్భుతమైన వాకింగ్ అండ్ రీక్రియేషన్ స్పాట్ గా రూపాంతరం చెందింది. హైడ్రా పనుల పుణ్యమా అని దుర్గంధం, దోమల బెడద నుంచి విముక్తి లభించిందని, ఆస్తి విలువలు కూడా పెరిగాయని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా చెరువు బిఫోర్ – ఆఫ్టర్ వీడియోలు, ఫోటోలు విపరీతంగా వైరల్ అవుతున్నాయి. కేవలం కూల్చివేతలకే పరిమితం కాకుండా.. ప్రజాధనం వృథా కాకుండా చెరువులను పునరుద్ధరించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో హైడ్రా తన ప్రత్యేక ముద్రను వేసిందని నెటిజన్లు, ఉప్పల్ వాసులు కొనియాడుతున్నారు.

# విద్యా వ్యవస్థ అంత దారుణమా...




హైదరాబాద్ : మన రాష్ట్రంలో ప్రతి సంవత్సరం సుమారు లక్షా పదివేల మంది విద్యార్థులు వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి పట్టాలు పొందుతున్నారు. కానీ ఈ పట్టాలు చేతపట్టుకుని బయటకు వస్తున్న యువతలో కేవలం పదిహేను శాతం మంది మాత్రమే పరిశ్రమల ప్రమాణాలకు సరిపోతున్నారు. మిగిలిన మెజారిటీ విద్యార్థులు కనీసం ప్రాథమిక కోడింగ్ లేదా కమ్యూనికేషన్ నైపుణ్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల పరిస్థితిని ప్రస్తావిస్తూ కఠినమైన పదాలు వాడారు. గమనించాల్సిన విషయం ఏమిటంటే గతంలో కేసీఆర్ కూడా అసెంబ్లీలో ఇదే ఆందోళన వ్యక్తం చేశారు. ఇద్దరు నేతల మాటల శైలి వేరుగా ఉన్నప్పటికీ వారిద్దరి ఆవేదన వెనుక ఉన్న ప్రధాన కారణం మన విద్యావ్యవస్థలో నెలకొన్న తీవ్రమైన లోపమే. సాంకేతిక విద్య ఈ స్థాయికి దిగజారడానికి ప్రధాన కారణం విద్యావ్యవస్థ పూర్తిగా వ్యాపారమయం కావడమే. గత కొన్ని సంవత్సరాలుగా పుట్టగొడుగుల్లా వెలిసిన ప్రైవేట్ కళాశాలల్లో తగినంత మౌలిక వసతులు అసలే లేవు. ఆధునిక ప్రయోగశాలలు లేకపోవడం అలాగే అనుభవం ఉన్న నాణ్యమైన అధ్యాపకుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైపు వేగంగా దూసుకుపోతుంటే చాలా కాలేజీలు ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే బోధిస్తున్నాయి. ప్రశ్నాపత్రాలు కేవలం పుస్తకాల్లోని విషయాలను గుడ్డిగా గుర్తుపెట్టుకుని రాసే రీతిలోనే ఉంటున్నాయి. దీనివల్ల విద్యార్థుల్లో సమస్యలను స్వయంగా పరిష్కరించే ధోరణి పూర్తిగా కరువవుతోంది. తల్లిదండ్రులు తమ కష్టపడిన సంపాదనతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే ఫీజు సాయాన్ని కలిపి లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారు. పిల్లలను ఎంతో ప్రయాసపడి ఇంజినీరింగ్ చదివిస్తే డిగ్రీ పూర్తయ్యాక ప్రైవేట్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు రావడం లేదు. దీనితో నిరుద్యోగ యువత తీవ్ర నైరాశ్యంలోకి వెళ్లిపోతూ చివరకు ప్రభుత్వ ఉద్యోగాల కోసం తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారు. ఇంజినీరింగ్ పాసైన కుర్రాడు కనీసం చిన్న ఉద్యోగానికైనా సరిగ్గా వెళ్లలేకపోతున్నాడనే ఆవేదన పాలకులలో స్పష్టంగా కనిపిస్తోంది. నాయకులు చేసిన తీవ్రమైన వ్యాఖ్యలలో ఎవరి మనోభావాలను కించపరచాలనే ఉద్దేశం లేదు. అక్కడ కనిపిస్తున్నది సమాజం ముందున్న ఒక స్పష్టమైన వాస్తవం. పరిశ్రమల అవసరాలకు తగ్గ ప్రాక్టికల్ నైపుణ్యాలు లేకపోవడం వల్ల యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన శిక్షణ లేని కారణంగా కనీసం ఒక చిన్న దరఖాస్తును కూడా సరిగ్గా రాయలేని స్థితిలో విద్యార్థులు బయటకు వస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చడానికి కేవలం విమర్శలు సరిపోవు కానీ సరైన ప్రణాళికలు అవసరం. కాలేజీలు కేవలం మార్కులు అలాగే సర్టిఫికెట్లు ఇచ్చే యంత్రాలుగా మారడం వల్ల సమాజానికి ఒరిగేది ఏమీ లేదు.

సాంకేతిక రంగంలో ప్రపంచంతో పోటీపడే అర్హతలను అందించేలా విద్యాప్రమాణాలు పూర్తిగా మారాలి. అప్పుడే యువతకు బంగారు భవిష్యత్తు లభిస్తుంది. ప్రస్తుత తరానికి అర్థమయ్యేలా సులభమైన మంచి తెలుగులో మన విద్యావ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసుకోవాలి. యువత కేవలం డిగ్రీ పత్రాల కోసం కాకుండా నిజమైన నైపుణ్యాలు సంపాదించే దిశగా అడుగులు వేయాలి. ప్రభుత్వం కూడా కాలం చెల్లిన సిలబస్‌ను మార్చి పరిశ్రమలకు కావాల్సిన కోర్సులను కాలేజీల్లో ప్రవేశపెట్టాలి. అప్పుడే ఈ రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి ప్రపంచ వేదికపై గర్వంగా నిలబడగలుగుతాడు. నేటితరం యువతకు కావాల్సింది కేవలం డిగ్రీ కాదు కానీ అద్భుతమైన సృజనాత్మకత. ఈ దిశగా అందరూ కలిసికట్టుగా ఆలోచించి తగిన చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

# అందుబాటులోకి తొలి ప్రైవేట్ ఆయిల్ పామ్



ఖమ్మం : తెలంగాణలో తొలి ప్రైవేటు సమీకృత ఆయిల్‌పామ్ పరిశ్రమ ఖమ్మం జిల్లా అంజనాపురంలో ఈ నెల 20న ప్రారంభం కానుంది. గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ రూ.300 కోట్ల పెట్టుబడితో 113.5 ఎకరాల్లో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా 700 మందికి ఉపాధి లభించనుంది. మలేసియా భాగస్వామ్యంతో దేశంలోనే తలమానికంగా నిలిచే సీడ్ గార్డెన్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మరో ఆరు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటి ప్రైవేటు సమీకృత ఆయిల్‌పామ్ పరిశ్రమ ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. ప్రముఖ గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ సంస్థ ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి రెవెన్యూ పరిధిలోని అంజనాపురం గ్రామపంచాయతీలో ఈ మెగా ప్రాజెక్టును నిర్మించింది. దాదాపు రూ.300 కోట్ల భారీ పెట్టుబడితో 113.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ సమీకృత పరిశ్రమను ఈ నెల 20న ప్రారంభించేందుకు సంస్థ సర్వ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సంస్థ ప్రతినిధులు ఇప్పటికే ఆహ్వానించారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 700 మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ పరిశ్రమలో ఇప్పటికే నర్సరీ కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతుండగా.. దాదాపు మూడు లక్షల మొక్కలను పెంచుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 1.40 లక్షల మేలైన మొక్కలను రైతులకు సరఫరా చేశారు. ఈ పరిశ్రమ పరిధి కిందికి సంగారెడ్డి జిల్లాతో పాటు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని 12 మండలాలను ప్రభుత్వం కేటాయించింది. ఈ సరికొత్త ఫ్యాక్టరీతో తెలంగాణలో ఆయిల్‌పామ్ పరిశ్రమల సంఖ్య నాలుగుకు చేరుకోనుంది. ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలోని అప్పారావుపేటలో గంటకు 90 టన్నులు, అశ్వారావుపేటలో గంటకు 30 టన్నులు, సిద్దిపేట జిల్లా నర్మెటలో గంటకు 30 టన్నులతో కర్మాగారాలు నడుస్తుండగా.. అంజనాపురం కర్మాగారం గంటకు 15 టన్నుల సామర్థ్యంతో అందుబాటులోకి వస్తోంది. ఇదే కాకుండా కల్లూరుగూడెం, బీచ్‌పల్లి, ఇంచర్ల, పెద్దరాత్‌పల్లి, సంకిరెడ్డిపల్లి, యాచారంలలో నిర్మాణ దశలో ఉన్న మరో ఆరు కర్మాగారాలను ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టులో ఏర్పాటు కానున్న సీడ్ గార్డెన్ దేశానికే తలమానికంగా నిలవనుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మలేసియా కంపెనీ భాగస్వామ్యంతో గోద్రెజ్ సంస్థ ఈ విత్తన తోటను అభివృద్ధి చేస్తోందని ఆయన తెలిపారు. దీని ద్వారా రైతులకు తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడినిచ్చే హైబ్రిడ్ రకాల విత్తనాలు లభిస్తాయని ఇవి అంతర్గత పంటల సాగుకు ఎంతో అనుకూలంగా ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రైవేటు సమీకృత పరిశ్రమ రాకతో తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం మరింత వేగంగా పెరగనుందని ఆయన వెల్లడించారు. సాంప్రదాయ పంటలకు భిన్నంగా అధిక లాభాలను ఇచ్చే వాణిజ్య పంటలను తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు.

# పోలీసుల ఆధ్వర్యంలో ఈగిల్ బృందం విస్తృత అవగాహన కార్యక్రమం

సి. బెలగల్: మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నియంత్రణ, మహిళల భద్రతతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు సి. బెలగల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఈగిల్ బృందం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించింది. కర్నూలు జిల్లా పోలీసు శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సి. బెలగల్ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీ వేణుగోపాల్ రాజు, ఈగిల్ సిబ్బంది రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొని ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వేణుగోపాల్ రాజు మాట్లాడుతూ, సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం గంజాయి, మాదకద్రవ్యాలు, ఇతర నిషేధిత మత్తు పదార్థాల వినియోగం, రవాణా, విక్రయం, నిల్వ చేయడం వంటి చర్యలు తీవ్రమైన నేరాలని వివరించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయం లేదా రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ఈగిల్ టోల్ ఫ్రీ నంబర్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఇటీవల డిజిటల్ అరెస్ట్ పేరుతో, ఫేక్ లోన్ యాప్‌లు, నకిలీ పెట్టుబడి పథకాలు, కేవైసీ అప్‌డేట్ పేరుతో జరుగుతున్న మోసాల గురించి వివరించారు. బ్యాంకు అధికారులు, పోలీసులమని చెప్పినా ఓటీపీలు, బ్యాంక్ ఖాతా వివరాలు, ఏటీఎం పిన్‌లు, యూపీఐ పాస్‌వర్డ్‌లు లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ ఇవ్వకూడదని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే డబ్బు తిరిగి పొందే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు. మహిళల భద్రతపై ప్రత్యేకంగా మాట్లాడుతూ, ప్రభుత్వం మరియు పోలీసు శాఖ మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని చెప్పారు. ఈవ్‌టీజింగ్, గృహహింస, వేధింపులు, బెదిరింపులు లేదా మహిళలపై ఏ రూపంలోనైనా నేరాలు జరిగినప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళలకు రక్షణ కల్పించేందుకు పోలీసు శాఖ 24 గంటలు అందుబాటులో ఉంటుందని, ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. రోడ్డు భద్రతపై కూడా ప్రజలకు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. అతివేగంగా వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించడంతో పాటు విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమం ముగింపులో ప్రజలు చట్టాలను గౌరవిస్తూ నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని ఎస్ఐ వేణుగోపాల్ రాజు విజ్ఞప్తి చేశారు. గ్రామాలు, కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నా, చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

## తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కర్నూలును

# కరువు జిల్లాగా ప్రకటించాలి

దేవనకొండ : తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని నష్టపోయిన రైతుకు ఎకరాకు 50 వేల రూపాయలు పరిహారంగా చెల్లించాలని తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టి బ్యాంకుల్లో ఉన్న రైతుల అన్ని రకాల అప్పులు రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి. రామచంద్రయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య, డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన కరువు పరిశీలన జీపు జాత దేవనకొండకు వచ్చిన సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో రైతుల యొక్క పంట పొలాలను పరిశీలించి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆకాశం వైపు ఆశగా చూస్తూ విత్తనాలు చల్లిన రైతన్నకు ఈ ఏడాది ప్రకృతి తీవ్ర నిరాశనే మిగిల్చిందన్నారు. కర్నూలు జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వేలాది ఎకరాల్లో సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. అప్పులు చేసి సాగు ప్రారంభించిన రైతులు ఇప్పుడు పంటలు కళ్లముందే ఎండిపోతుండటంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని అన్నారు. కుటుంబ పోషణ ఎలా చేయాలన్న ఆందోళనలో అనేక మంది రైతులు రోజులు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎండిపోయిన పంటలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతు కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులు చెల్లించిన పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే భరించి, ఇప్పటికే రైతులు చెల్లించిన ప్రీమియం మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో తిరిగి జమ చేయాలని కోరారు. అలాగే కరువు కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతి రైతు కుటుంబానికి ఆరు నెలల పాటు నెలకు రూ.20,000 చొప్పున ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న వ్యవసాయ రుణాలను పూర్తిగా మాఫీ చేయడంతో పాటు, పంట నష్టానికి ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 3న అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట రైతులతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రాజకీయాలకు అతీతంగా రైతు సోదరులంతా ఈ ఉద్యమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే. మద్దిలేటి శెట్టి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె. నాగేంద్ర, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి. రాజా సాహెబ్, జిల్లా సమితి సభ్యుడు కారన్న, రైతు సంఘం జిల్లా నాయకులు తిమ్మప్ప సిపిఐ రైతు సంఘం నాయకులు బజారి వీరాంజి భాస్కర్ లక్ష్మన్న శ్రీనివాసులు రామాంజి రాహుల్, భూసల రామాంజి మధు నాగేంద్ర రామస్వామి మల్లి, టక్కు.రామంజి పలువురు రైతులు పాల్గొన్నారు.

# సి.బెలగల్‌ను కరువు మండలంగా ప్రకటించాలి: సిపిఐ డిమాండ్

సి.బెలగల్ : కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా, సి.బెలగల్ మండలాన్ని కరువు మండలంగా వెంటనే ప్రకటించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యవర్గ సభ్యులు రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు సోమవారం సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సి.బెలగల్ తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన జిల్లాల్లో ఒకటిగా ఉందన్నారు. ముఖ్యంగా సి.బెలగల్ మండలంలో శాశ్వత నీటి వనరులు లేకపోవడంతో రైతులు పూర్తిగా వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయని, ఇప్పటికే వేలాది మంది రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలపై పెట్టిన పెట్టుబడులు తిరిగిరాక అప్పుల ఊబిలో కూరుకుపోయి, జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రైతుల నుంచి పంటల బీమా ప్రీమియం వసూలు చేయడం అన్యాయమని, పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరించాలని డిమాండ్ చేశారు. రైతులపై అదనపు ఆర్థిక భారం మోపకుండా ప్రభుత్వం ప్రత్యక్ష సహాయం అందించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వర్షాలు కురిసిన వెంటనే రైతులు తిరిగి సాగు ప్రారంభించేందుకు ఉచితంగా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని సూచించారు. అదేవిధంగా కరువు ప్రభావంతో పశువులకు మేత కొరత ఏర్పడినందున మూగజీవాలకు పశుగ్రాసం, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని, గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను పూర్తిగా మాఫీ చేసి, ప్రతి రైతుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కరువు కారణంగా ఇబ్బందులు పడుతున్న రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 15 రకాల నిత్యావసర వస్తువులను ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు నల్లన్న, మండల సహాయ కార్యదర్శులు పకీరప్ప, శేషు, మండల కార్యదర్శి మల్లికార్జున, బాలు, రవి, చిన్న ఈరన్న, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో తెలంగాణకు పెట్టుబడుల పిలుపు:

బాల్టిమోర్ (అమెరికా): అమెరికన్ తెలుగు అసోసియేషన్ 19వ జాతీయ మహాసభల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రవాస భారతీయులకు మాతృభూమికి రుణం తీర్చుకునే సమయం వచ్చిందని పిలుపునిచ్చారు. ముఖ్యాంశాలు:తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి.. ప్రపంచ అభివృద్ధి చెందిన దేశాలకు పోటీగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. సింగిల్ విండో విధానం ద్వారా అన్ని అనుమతులను వేగంగా మంజూరు చేసి, ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. పరిశ్రమలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రవాస భారతీయులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

మూసీ నది పునరుజ్జీవనం, రీజినల్ రింగ్ రోడ్, 36 రేడియల్ రోడ్లు, ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను వివరించారు. ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్' ఏర్పాటు చేస్తున్నామని, ఈ కార్యక్రమంలో ప్రవాసులు భాగస్వాములు కావాలని కోరారు. ఎన్ఆర్ఐల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థఎన్ఆర్ఐలు, వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారం కోసం చట్టబద్ధ అధికారాలతో కూడిన ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటును ప్రభుత్వం పరిశీలిస్తోందని వెల్లడించారు.

స్పెషల్ ఎడిషన్
తెలుగు దినపత్రిక
బుధవారం, ఆగస్టు 05, 2026

## శ్రీనన్న ఆత్మీయ భరోసా.. ప్రతి పేద కుటుంబ నమ్మకానికి ప్రతీక

### పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 44 కుటుంబాలకు రూ.10,000/ రూపాయల ఆర్థిక భరోసా.



పాలేరు : కూసుమంచి మండలం పరిధిలోని పలు గ్రామాలలో సోమవారం నేలపట్ల, లోక్య తండా, గంగ బండ తండ, గట్టుసింగారం, మల్లెపల్లి, పెరక సింగారం, హిరమన్ తండ, నాయకన్ గూడెం, పాలేరు, సంధ్య తండ, గైగోలపల్లి, పోచారం, ముత్యాల గూడెం, కేశవపురం, తురకగూడెం,కూసుమంచి గ్రామాలలో వివిధ కారణాలతో మరణించిన 44 కుటుంబాలకు PSR చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.10,000/ రూపాయల ఆర్థిక సహాయాన్ని కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ కుటుంబ పెద్ద ను కోల్పోయి కష్ట సమయంలో మమ్మల్ని ఒంటరిగా వదిలేయకుండా మా కుటుంబాలకు అండగా నిలిచిన మంత్రివర్యులు పొంగులేటి శ్రీనన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బజ్జూరి వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మంకెన వాసు, జిల్లా నాయకులు జొన్నలగడ్డ రవి, మాజీ ఎంపీపీ జూకూరి గోపాల్ రావు కాంగ్రెస్ పార్టీ నాయకులు కంచర్ల జీవన్ రెడ్డి,మాజీ సర్పంచ్ చాట్ల పరుశురాం, కొర్ర రమేష్, కొత్త పుల్లారెడ్డి, సర్పంచ్ లు వడిత్య వెంకటేష్ నాయక్, బాదావత్ నరేష్, యువజన విభాగం శేఖర్ రెడ్డి, మహమ్మద్ రఫీ ఆయా గ్రామ సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొనడం జరిగింది.

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

### – ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం : ప్రజలు తమ సమస్యలు తెలిపి సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. ఖానాపురం హవేలీ శివారు టేకులపల్లికి చెందిన వి. వెంకటయ్య ఈ నెల తనకు వృద్ధాప్య పెన్షన్ డబ్బులు జమ కాలేదని తన బ్యాంకు ఖాతాలో ఆ డబ్బులు జమ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరం 44వ డివిజన్ లెనిన్ నగర్ కు చెందిన ఎస్.కే నాజియా తన కుమార్తె తలసేమియా వ్యాధితో బాధపడుతున్నా రని, తన కుమార్తె కు ఫించన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ, సెర్ప్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం అర్బన్ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఎం. సూర్య ప్రకాష్ పాపిరెడ్డి ఖమ్మం దేవరపల్లి హైవే ధంసలాపురం ఎంట్రీ ఎగ్జిట్ వద్ద ఉన్న తమ భూమికి దారి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడి ఎన్. హెచ్ అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.నేలకొండపల్లి మండలం నాచేపల్లి గ్రామానికి చెందిన వి. రామకృష్ణ తాను పి.జీ చదువుకున్నానని తనకు కంటికి సంబంధించిన దివ్యాంగత్వం ఉందని, తనకు ఏదైనా ఉపాధి చూపించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా ఉపాధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి

పాలేరు : కూసుమంచి మండల పరిధిలోని సోమవారం బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు వడిత్య బాలక్రిష్ణ, తాతయ్య బిచ్చ, ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, లింగారం తండా నందు బిచ్చ,చిత్ర పట్టానికి పూలమాలలు వేసి,నివాళులర్పించి,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇటీవల మరణించిన గోరీలపాడు తండాబానోత్ మాన్ సింగ్ నాయక్ రాజు తండా భూక్యా కోటయ్య, నాయక్,వాంకుడొత్ దేవ్జ్యా, కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, పలు సర్పంచులు, వార్డు మెంబర్స్, మాజీ ఎంపీటీసీలు, వైస్ సర్పంచ్, టిఆర్ఎస్ జిల్లా పార్టీ నాయకులు, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో ఘన సన్మానం అందుకున్న సీనియర్ జర్నలిస్టు ఇజాజ్ అహ్మద్ ఖాన్

### 34 ఏళ్ల విశిష్ట పాత్రికేయ సేవలకు 'తబస్సుమ్ ఫరీది అవార్డు' ప్రదానం్న మంత్రి మహ్మద్ అజహరుద్దీన్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ చేతుల మీదుగా సత్కారం



నిర్మల్ : నిర్మల్ జిల్లా సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇజాజ్ అహ్మద్ ఖాన్ పాత్రికేయ రంగంలో 34 ఏళ్లుగా అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక 'తబస్సుమ్ ఫరీది అవార్డు' తో సహా పదివేలు బహుమతి అందుకున్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ మీడియా అకాడమీలో ఫెడరేషన్ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, టీఎంఆర్ఎంఐ ఉపాధ్యక్షుడు ఫహీమ్ ఖురేషీ చేతుల మీదుగా ఆయనకు మొమెంటో, ప్రశంసాపత్రం, శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఏ. మాజిద్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ గౌస్ మొహియుద్దీన్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఇజాజ్ అహ్మద్ ఖాన్‌కు అవార్డు లభించడంతో పాత్రికేయులు, బంధుమిత్రులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. అమెరికాలో ఉన్న సీనియర్ జర్నలిస్టు మహ్మద్ షాహిద్ అహ్మద్ తవక్కల్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు వసీం తష్కీల్, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ ఖాన్ తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇజాజ్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ, ఈ అవార్డు తన వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా ఉర్దూ పాత్రికేయులందరి సేవలకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానని, శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి

### – జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ : ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు.

కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగులందరూ తప్పనిసరిగా ప్రతి రోజూ ముఖ గుర్తింపు హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులంతా తప్పనిసరిగా ప్రభుత్వ విద్యాసంస్థలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ఉండాలని చెప్పారు.

తనిఖీ వివరాల నివేదికలు సంబంధిత యాప్ లో నమోదు చేయాలని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మల్దకల్ పాఠశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు




గద్వాల : జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని పి యం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మల్దకల్ లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలకు 216 మంది నూతన విద్యార్థులు ప్రవేశం పొందగా, నేటి వరకు మొత్తం విద్యార్థుల నమోదు 726కు చేరుకుంది.ప్రైవేట్ పాఠశాలల నుంచి దాదాపు 60 అడ్మిషన్స్ రావటం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు నూతనంగా చేరిన విద్యార్థులకు పుష్పగుచ్చాలు అందించి ఆత్మీయంగా స్వాగతం పలికారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, పీ యం శ్రీ పథకం ద్వారా నాణ్యమైన విద్య, డిజిటల్ తరగతులు, ఆధునిక మౌలిక సదుపాయాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలుపుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు నిర్వహించిన పాటలు, నృత్యాలు, ఆటలు, వినోదాత్మక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కొత్తగా చేరిన విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ పాఠశాలలో లభించిన ఆత్మీయ స్వాగతానికి ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులకు వ్యక్తిగతంగా పాల్గొని అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి. సురేష్,ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని ఫ్రెషర్స్ డే వేడుకలను విజయవంతం చేశారు.

## నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల

### పోలీస్ స్టేషన్ రికార్డులు, కేసుల పురోగతి, సిబ్బంది పనితీరుపై సమీక్ష

### ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన పోలీసింగ్ అందించాలని అధికారులకు ఆదేశం




నిర్మల్ : నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్, రికార్డు రూమ్‌తో పాటు స్టేషన్ నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేసి, నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల పరిష్కార తీరును సమీక్షించారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, దర్యాప్తును నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను ఓపికగా విని చట్టపరంగా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మల్ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, నేరాల నివారణకు పెట్రోలింగ్‌ను మరింత పటిష్టం చేయాలని తెలిపారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు పోలీసులపై మరింత నమ్మకం పెరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా మిత్ర పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, నిర్మల్ టౌన్ సీఐ సమ్మయ్య, ఎస్ఐలు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## అఖండ భజన సప్తాహ కరపత్రం ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండ్ల



గద్వాల ప్రతినిధి : గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు సోమవారం మల్దకల్ మండలం కేంద్రంలోని శ్రీ శ్రీ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు అఖండ భజన సప్తాహ కార్యక్రమము తేదీ : 8-08-2026 శనివారం నుండి 15-08-2026 శనివారం జరిగే అఖండ జ్యోతి సప్తాహ భజన కరపత్రము ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించడం జరిగింది.ఎమ్మెల్యేకి సర్పంచ్ శాలువా కప్పి పుష్పగుచ్ఛ ఇచ్చి ఘనంగా సత్కరించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూసకాలంలో వర్షాలు పడాలని రైతులు పండించిన పంటలు మంచి గిట్టుబాటు ధర రావాలి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి గద్వాల సస్యశ్యామలముగా ఉండాలని కోరుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సిరి సంపదలతో కలిగి ఉండాలని ఈ సప్తాహ భజన దేవాలయ ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుంది అని పేర్కొన్నారు.

ఈ సప్తహ భజన కార్యక్రమమును దిగ్విజయము చేసి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరుచున్నాము. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ ప్రహ్లాద రావు, జిల్లా కన్వీనర్ నల్లారెడ్డి, సర్పంచ్ చిట్టెమ్మ, నాయకులు వెంకటన్న నరేందర్, మధునాయకి, తిమ్మరాజు, పరుశరాముడు, నాగరాజు, నారాయణ, నర్సింహులు, ప్రవీణ్, తిమ్మప్ప, శ్రీను, రాజు, కృష్ణమూర్తి , నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి

### – రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి.

నిర్మల్ : రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారముల డిజిటలైజేషన్ ప్రక్రియపై అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాదు నుంచి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియ మొత్తాన్ని పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. ఎటువంటి తప్పులు దొర్లకుండా డిజిటలైజేషన్ చేపట్టాలన్నారు. ఎస్ఐఆర్ డిజిటలైజేషన్, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ( హేతుబద్ధీకరణ) ప్రక్రియలపై జిల్లాల వారిగా సమీక్షించారు.




ఒకే కుటుంబానికి చెందిన కుటుంబ సభ్యులు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఓటు ఉంటే, వారిని ఒకే పోలింగ్ కేంద్రం కిందకు వచ్చేలా రేషనలైజేషన్ (హేతుబద్ధీకరణ) ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. ఒక కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

### – జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ : జిల్లాలో రెవెన్యూ శాఖకు సంబంధించిన ప్రజల దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అంశాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి, ప్రజావాణి, సీఎం ప్రజావాణి, రెవెన్యూ సదస్సులు, సదాబైనామా తదితర భూ సమస్యలకు సంబంధించిన దీర్ఘకాలిక పెండింగ్ దరఖాస్తులను ప్రత్యేక దృష్టితో త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల వివరాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అన్ని దరఖాస్తులను పూర్తి చేయాలని, పరిష్కారం కాని వాటిని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.



తిరస్కరించే దరఖాస్తులకు స్పష్టమైన కారణాలను నమోదు చేయాలని, ప్రజల వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. భూముల సర్వే, రీ-సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 'మన ఇసుక వాహనం' యాప్ ద్వారానే ఇసుక విక్రయాలు జరిగేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, డీఆర్వో రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, ఏడీ ల్యాండ్ సర్వే రికార్డ్స్ నరసింహమూర్తి, తహసీల్దార్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ ఎడిషన్ తెలుగు దినపత్రిక



## ప్రియుడిపై మోజు...భర్తనే చంపాలనుకుంది

చిత్తూరు : ప్రియుడిపై మోజుతో భర్త, పిల్లలను వదిలేసి వివాహిత వేరే కాపురం పెట్టింది. మొదట భర్తను చంపాలనుకొని స్కెచ్ వేసి.. తర్వాత మనసు మార్చుకొని పారిపోయి ప్రియుడిని పెళ్లి చేసుకుంది. చిత్తూరు జిల్లా గుడుపల్లి మండలం గుడికొత్తూరు గ్రామానికి చెందిన చిరంజీవికి శోభ(27) అనే మహిళతో 8 ఏళ్ల క్రితం వివాహం కాగా.. వీరికి ఇద్దరు పిల్లలు. ఈ నేపథ్యంలో రాంగ్ కాల్ ద్వారా శోభకు గుంటూరు జిల్లా కండ్రిగకు చెందిన బాలాజీ నాయక్(22) పరిచయమ యింది. ఇన్స్టాగ్రామ్ చాట్ ద్వారా మరింత స్నేహం పెరిగాక ఆ జంట ప్రేమలో పడింది. ఈ విషయం తెలిసి తన భర్త రోజూ కొడుతున్నాడని మొదట అతన్ని హత్య చేసి, ఆ తర్వాత ఇద్దరూ పెళ్లి చేసుకుందామని భార్య ప్లాన్ వేసింది. తర్వాత మనసు మార్చుకున్న ఆమె గత నెల రోజుల క్రితం పారిపోయి కుప్పంలో ఓ గుడిలో శోభ, బాలాజీ నాయక్ పెళ్లి చేసుకున్నారు. భర్త తన భార్య శోభ కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఈ క్రమంలో శోభ తన మరో యువకుడితో కలిసి బెగ్గిలిపల్లిలో ఉంటున్నట్లు గుర్తించి వారిని భర్త చిరంజీవి తరపు బంధువులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. శోభ తనను పెళ్లి చేసుకోకుంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిందని, ఆమె బలవంతంతో పెళ్లి చేసుకున్నానని ప్రియుడు బాలాజీ నాయక్ తెలిపాడు. తన భర్త రోజూ అనుమానంతో వేధించి కొట్టేవాడని.. ఆ దెబ్బలు చూసి బాలాజీ నాయక్ తన భర్తను చంపుతానంటే వద్దని పారిపోయి వచ్చి పెళ్లి చేసుకున్నానని భార్య శోభ అంటోంది. ఈ గొడవను పరిష్కరించలేక పోలీసులు తలలు పట్టుకున్నారు.

## నాగర్ కర్నూలు జిల్లాలో న్యాయవాది దారుణ హత్య

### కళ్లలో కారం చల్లి, వేటకొడవళ్లతో నరికి దారుణ హత్య

నాగర్ కర్నూలు : నాగర్ కర్నూలు జిల్లా పెంట్లవెల్లిలో ఆర్ఎంపీ, న్యాయవాదిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న మల్లయ్య(55) తన క్లినిక్లో ఉండగా తమకు ఆరోగ్యం బాగాలేదని గుర్తుతెలియని ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు వచ్చారు. మల్లయ్య కళ్లల్లో కారం చల్లారు. తరువాత ప్రధాన రహదారిపైకి లాక్కొచ్చి వేటకొడవళ్లతో విచక్షణారహితంగా నరికి చంపారు. దాడిలో మల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భూ తగాదాలే హత్యకు కారణమని అనుమానిస్తున్నారు.

## గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరం పాటుపడదాం

### - గ్రామ సర్పంచ్ రేండ్ల శారద

కమాన్ పూర్ : కల్వచర్ల గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరం పాటు పడదామని గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి అన్నారు. రామగిరి మండలంకల్వచర్ల గ్రామంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక గ్రామసభ నిర్వహించారు.రామగిరి మండలం కల్వచర్ల గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామసభకు సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి అధ్యక్షత వహించారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, విద్య, ఆరోగ్యం తదితర అంశాలపై ప్రజలతో చర్చించి వారి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించారు.గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇచ్చి, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించే దిశగా తీర్మానాలు చేశారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఉ పసర్పంచ్ కప్పు మహేందర్,కార్యదర్శి ప్రదీప్, వార్డు సభ్యులు,అంగన్వాడీ టీచర్లు,ఆశ వర్కర్లు, లైన్ మెన్ ఆకుల శ్రీనివాస్,ప్రాథమిక ఆరోగ్య శాఖా డా దేవేందర్,అగ్రికల్చర్ ఏ ఈ అరవింద్ పాల్గొన్నారు.

## మహిళను మోసం చేసిన ఎస్సై అరెస్టు

హైదరాబాద్ : తెలంగాణలో మహిళలను వేధిస్తున్న పోలీసుల జాబితాలో మరో ఎస్సై పేరు చేరింది. మహిళలపై లైంగిక దాడి కేసులో ఎస్సై శ్రీకాంత్ అరెస్ట్ అయ్యారు. సోషల్ మీడియాలో పరిచయాలు పెంచుకొని మహిళలను మోసం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై లైంగిక దాడి చేసినట్లు కేసు నమోదయింది. హైదరాబాద్ యువతి ఫిర్యాదుతో జగిత్యాల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసారు. సాంకేతిక ఆధారాలతో నిజామాబాద్లో పోలీసులు నిందితుడిని గుర్తించారు. ఎస్సై శ్రీకాంత్ను అరెస్ట్ చేసి హనుమకొండకు తరలించారు. నిందితుడు సిరిసిల్ల జిల్లాకు చెందిన ఎస్సైగా గుర్తించారు.

## డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి విశేష స్పందన

### ప్రజల సమస్యల పరిష్కారానికి మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణ చర్యలు

హుస్నాబాద్ : హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే ఉద్దేశంతో నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దాదాపు 80కి పైగా ఫోన్ కాల్స్కు స్వయంగా స్పందించారు. ప్రజలు తెలిపిన సమస్యలను శ్రద్ధగా విన్న మంత్రి, సంబంధిత అధికారులతో వెంటనే ఫోన్లో మాట్లాడి తక్షణ పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, భూ సమస్యలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పెండింగ్ అభివృద్ధి పనుల పూర్తి, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ తదితర ప్రజా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన వేదికగా నిలుస్తోందన్నారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించడం తన బాధ్యత అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి సమస్యను బాధ్యతాయుతంగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

## క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో బ్యాగుల పంపిణీ

నాగర్ కర్నూల్ : క్లాస్మేట్ క్లబ్ 365 రోజులు 365 కార్యక్రమాలలో భాగంగా 213 వ సహాయ నిరాకరణోద్యమం ప్రారంభ దినోత్సవం పురస్కరించుకుని క్లాస్మేట్ క్లబ్ వ్యవస్థాపకులు వాస రాఘవేందర్ సూచన మేరకు తాడూరు మండలం ఆధ్వర్యంలో ఎంపీపీఎస్ తాడూరు స్త్రలి పాఠశాల లో ఒకటో తరగతి విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేయడం జరిగింది . ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓ.ఆ. విజయ్ కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాండూర్ మండల విద్యాధికారి శ్రీ త్యాగరాజు గౌడ్ పాల్గొని మాట్లాడుతూ సమయోధుల సేవలను కొనియాడారు క్లాస్మేట్ అందిస్తున్న సహారాన్ని తీసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమలో తాడూరు క్లాస్మేట్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస ఆచార్యులు గారు మరియు ఉపాధ్యాయులు రాధిక, లక్ష్మి, రాములు పాల్గొనడం జరిగింది అదేవిధంగా పెద్ద ముద్దునూరు పాఠశాల యందు ఉపన్యాస పోటీలు నిర్వహించడం జరిగింది.

## హైడ్రా అభివృద్ధి చేసిన.. ఉప్పల్ నల్ల చెరువుకు జలకళ

హైదరాబాద్: హైడ్రా పునరుద్ధరించిన ఉప్పల్ నల్ల చెరువు జలకళను సంతరించుకుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉప్పల్ నల్లచెరువు వరద నీరుతో నిండింది. భారీ మొత్తంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి మురికి కూపంగా మారిన ఈ చెరువును హైడ్రా పునరుద్ధరిస్తున్న విషయం అందరికీ విదితమే. ఈ క్రమంలో వర్షాలు పడినప్పుడు వరద నీరు చెరువులోకి చేరేలా.. తక్కువ మొత్తంలో పారే మురుగు నీరు బైపాస్ చేసిన కాలువలోంచి బయటకు పోయేలా కాలువలను హైడ్రా అభివృద్ధి చేసింది.

## బాలల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నిర్ణాయక

# జాతీయ ప్రచారం ప్రారంభం

వనపర్తి : వనపర్తి ,జోగులాంబ గద్వాల, మహబూబ్నగర్ జిల్లాలో ప్రపంచ వ్యక్తుల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న బాలల హక్కుల సంస్థ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ, న్యూఢిల్లీలో ప్రారంభించబడిన దేశవ్యాప్త 'బాలల అక్రమ రవాణా వ్యతిరేక జాతీయ ప్రచారం'లో భాగంగా బాలల అక్రమ రవాణాపై నిర్ణాయక పోరాటాన్ని ప్రకటిస్తున్నట్లు తెలిపింది. బాలల అక్రమ రవాణాను నిరోధించడానికి ప్రభుత్వం, స్థానిక యంత్రాంగం మరియు బాల సంక్షేమ వర్గాలతో కలిసి పనిచేస్తూ, జిల్లాను పిల్లలకు మరింత సురక్షితంగా మార్చడానికి తాము కట్టుబడి ఉన్నామని సదరు సంస్థ తెలిపింది. ఈ ప్రచారంలో భాగంగా, జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే, అణగారిన, ప్రమాదంలో ఉన్న కుటుంబాలను గుర్తించి, పిల్లలు బడిలోనే ఉండేలా మరియు రవాణా ముఠాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానిస్తారు. దీనికిదనంగా, గుర్తించిన అక్రమ రవాణాదారులపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటారు. జాతీయ ప్రచారం నేపథ్యంన్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్లో బాలల హక్కులు, సామర్థ్యం మరియు సమృద్ధిని నిర్ధారించడం అనే అంశంపై జరిగిన నాలుగు రోజుల జాతీయ ఆలోచనా సదస్సులో ఈ జాతీయ ప్రచారాన్ని ప్రారంభించారు. 2030 నాటికి భారతదేశాన్ని బాలల అక్రమ రవాణా రహితంగా మార్చడానికి మరియు బాలల హక్కులను కాపాడటానికి పనిచేస్తున్న 250కి పైగా స్వచ్ఛంద సంస్థల దేశవ్యాప్త నెట్వర్క్ 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్' ఆధ్వర్యంలో, భారతదేశంలోని 782 జిల్లాల భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. రూరల్ డెవలప్మెంట్ సొసైటీఅనేది 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్' యొక్క భాగస్వామ్య సంస్థ. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్' పిల్లలపై జరిగే నేరాలకు వ్యతిరేకంగా ప్రపంచంలోనే అతిపెద్ద చట్టపరమైన జోక్య కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. భాగస్వామ్య సంస్థల ఉమ్మడి కృషితో, ఏప్రిల్ 2023 మరియు డిసెంబర్ 2025 మధ్య కాలంలో భారతదేశంలో 1,22,516 మంది పిల్లలను.అక్రమ రవాణా నుండి రక్షించారు. ఇది సమన్వయంతో కూడిన చట్టపరమైన చర్యలు మరియు సమాజ-ఆధారిత జోక్యాల ప్రభావాన్ని నిరూపిస్తోంది.

**కేంద్ర మంత్రి ప్రశంసలు**

ఈ సదస్సును ప్రారంభిస్తూ కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్.బాలల సంరక్షణను దేశంలోని అత్యంత సవాలుతో కూడిన బాధ్యతల్లో ఒకటిగా అభివర్ణించారు మరియు దోపిడీ నుంచి పిల్లలను రక్షించడంలో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషిని ప్రశంసించారు.ఒక్క చిన్నారి ప్రాణాన్ని కాపాడినా అది అత్యంత పవిత్రమైన కార్యం. చాలామంది చిన్న పిల్లలు అక్రమ రవాణాకు గురై మళ్లీ ఇంటికి చేరుకోలేకపోతున్నారు. ఎవరైనా వచ్చి తమను రక్షిస్తారని ఈ పిల్లలు ఎదురుచూస్తుంటారు. లైంగిక దోపిడీ నుంచి వారిని రక్షించే స్వచ్ఛంద సంస్థల వాలంటీర్లు దేవదూతలతో సమానం," అని ఆమె అన్నారు.

**క్షేత్రస్థాయి పరిస్థితులపై డైరెక్టర్ ఆందోళన**... ఈ సందర్భంగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ డైరెక్టర్ చిన్నమ్మ తామస్. మాట్లాడుతూ, భారతదేశంలో పిల్లలకు అత్యంత తీవ్రమైన ముప్పులలో బాలల అక్రమ రవాణా ఒకటిగా కొనసాగుతోందని చెప్పారు.సగటున ప్రతిరోజూ ఆరుగురు పిల్లలు అక్రమ రవాణాకు గురవుతుంటే, ఐదుగురు పిల్లలు బాలకార్మికు లుగా మారుతున్నారనేది విషాదకరమైన నిజం. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రతీ గంటకు 11 మంది పిల్లలు కనిపించకుండా పోతున్నారు, వారిలో అత్యధిక శాతం మంది అక్రమ రవాణా బాధితులుగా మారుతున్నారు. ఆయుధాలు, మాదక ద్రవ్యాల రవాణా తర్వాత మానవ హక్కుల ఉల్లంఘనగా నిలిచే మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద వ్యవస్థీకృత నేరం. మహిళలు, పిల్లలే దీని ప్రధాన లక్ష్యంగా ఉన్నారు.

## పెరవలి విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కే ఈ శాంబాబు

మద్దికేర: మద్దికేర మండల పరిధిలోని గల పెరవలి గ్రామంలో రూ. 2.75 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించిన పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ.శ్యామ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.రైతులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ నూతన ఉపకేంద్రం ద్వారా పెరవలి, బసినేపల్లి,రామాపురం,రామాపురం కొట్టాల,మదనంతపురం గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందనుంది. దీంతో తక్కువ వోల్టేజ్, విద్యుత్ అంతరాయాల సమస్యలు తగ్గి,ముఖ్యంగా వ్యవసాయ మోటార్లకు నిరంతరాయంగా విద్యుత్ అందడంతో రైతులు సకాలంలో సాగునీరు అందించి పంటలను మెరుగ్గా సాగు చేసుకునే అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. 5 ఎంవిఏ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ 33/11 కేవీ ఉపకేంద్రం భవిష్యత్తు విద్యుత్ అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని నిర్మించబడిందని, ఈ ప్రాంత ప్రజలకు మరియు రైతులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. "రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం" అని పేర్కొన్న ఎమ్మెల్యే కే.ఈ. శ్యామ్ కుమార్ విద్యుత్, రోడ్లు,తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను ప్రతి గ్రామానికి అందిస్తూ పత్తికొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు,ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు,కార్యకర్తలు, రైతులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాళేశ్వరం భూ గర్భంలో సమస్యలు



కరీంనగర్ : తెలంగాణలో రాజకీయంగా వివాదాస్పద అంశాల్లో ప్రతిష్టాత్మక కాళేశ్వరం ప్రాజెక్ట్ అతిముఖ్యమైనది. భారీ ఖర్చుతో నిర్మించిన ప్రాజెక్టుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మూడేళ్ల నుంచి మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి మరో కీలక విషయం బయటపడింది. ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, మరియు సుందిళ్ల బ్యారేజీల దిగువన భూగర్భంలో అనేక సాంకేతిక లోపాలు ఉన్నట్లు గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్ పరీక్షలలో తేలింది. బ్యారేజీల కొన్ని వెంట్స్ (నీరు ప్రవహించే మార్గాలు) కింద ఖాళీ ప్రదేశాలు ఏర్పడి నీరు చేరడం (కేవిటీస్), పెద్ద పరిమాణంలో బోల్డర్లు, దెబ్బతిన్న రాతి పొరలు, రాళ్ల దిగువ భాగాన పూడిక పేరుకుపోవడం వంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఈ జియోఫిజికల్ పరిశీలనల ఆధారంగా పుణెలోని ప్రసిద్ధ కేంద్ర జల, విద్యుత్తు పరిశోధనా సంస్థ డైరెక్టరు సెల్వబాలన్ ఒక సమగ్ర నివేదికను తెలంగాణ నీటిపారుదల శాఖకు పంపారు. 3 బ్యారేజీల దిగువన సుమారు 30 మీటర్ల లోతు వరకు భూగర్భంలో ఉన్న పరిస్థితులు, సీపేజీ మార్గాలు, అనామలీస్ (భిన్నమైన పరిస్థితులు)ను అధ్యయనం చేయడానికి ఈ అధునాతన జీపీఆర్ పరీక్షలను సీడబ్ల్యూపీఆర్ఎస్ నిర్వహించింది. ఈ అధ్యయనంలో భాగముగా మూడు బ్యారేజీల్లోని మొత్తం 225 వెంట్లకు గాను 217 వెంట్స్ వద్ద క్షేత్రస్థాయి అధ్యయనాలు జరిగాయి. ఈ నివేదికలోని వివరాల ప్రకారం, మేడిగడ్డ బ్యారేజీలోని 7 వెంట్స్ దిగువన అత్యంత తీవ్రమైన అనామలీస్ నమోదయ్యాయి. కీలకమైన మేడిగడ్డలోని 7వ బ్లాక్కు చెందిన 17, 18, 19, 20, 21 వెంట్లలోనూ, 8వ బ్లాక్లోని 7వ వెంట్లోనూ, 5వ బ్లాక్లోని 35వ వెంట్లోనూ ఈ భూగర్భ లోపాలను గుర్తించినట్లు నివేదికలో తెలిపారు. ఇదే ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీలోని 5వ బ్లాక్లో ఉన్న 47వ వెంట్ ఎగువ భాగంలోనూ, సుందిళ్ల బ్యారేజీలో 25, 31, మరియు 53వ వెంట్స్ వద్ద ఎగువ, దిగువ ప్రాంతాలలో సమస్యలు ఉన్నట్లు తేలింది. ఈ 3 బ్యారేజీలలో కలిపి మొత్తం 11 వెంట్స్ కింద మాత్రమే ఎలాంటి సమస్యలు లేదా అనామలీస్ లేవని, మిగతా వాటిలో చిన్న సమస్యలు ఉన్నాయని నివేదికలో వెల్లడించినట్లు సమాచారం. మేడిగడ్డ వద్ద నీటి ఉధృత ప్రవాహాల కారణంగా ఇసుక కొట్టుకుపోయి, రాఫ్ట్ దిగువన పెద్ద ఎత్తున శూన్య ప్రాంతాలు ఏర్పడ్డాయి. 6 వెంట్స్ వద్ద పదికి పైగా విభిన్నమైన అనామలీస్ జోన్లను శాస్త్రవేత్తలు నమోదు చేశారు. ఇటువంటి పరిస్థితులు నీటి అంతర్గత సీపేజ్, పైపింగ్ వంటి ప్రమాదకర పరిణామాలకు దారితీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అయితే, జీపీఆర్ పరీక్షలు కేవలం భూగర్భ పరిస్థితులను అంచనా వేయడానికి మాత్రమే పరిమితమని, నేరుగా స్ట్రక్చరల్ లోపాలను ఇవి నిర్ధారించలేవని సీడబ్ల్యూపీఆర్ఎస్ స్పష్టం చేసింది. అందువల్ల పునరావాస లేదా మరమ్మతు పనులు ప్రారంభించే ముందు బోర్హోల్, కోర్ డ్రిల్లింగ్, ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టోమోగ్రఫీ వంటి ఇంజినీరింగ్ పరీక్షలు నిర్వహించడం అనివార్యమని సూచించింది. ప్రాజెక్టు బ్యారేజీల నిర్మాణ సమయంలో ముందస్తు భూగర్భ అన్వేషణ పరీక్షలు చేపట్టకపోవడం వల్లే ఈ సమస్యలు ముందుగా గుర్తించలేకపోయినట్లు ఇంజినీరింగ్ టీమ్ పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం ఈ నివేదికను బయటపెట్టడం గానీ, మంత్రులు, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ అధికారులు గానీ కేంద్ర జల, విద్యుత్తు పరిశోధనా సంస్థ ( సీడబ్ల్యూపీఆర్ఎస్) నివేదికపై స్పందిస్తే మరిన్ని విషయాలు బయిటకు వచ్చే అవకాశం ఉంది

## స్టేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ నివారణ బిల్లుపై సెలెక్ట్ కమిటీ సమావేశం

కరీంనగర్ : తెలంగాణ స్టేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (నివారణ) బిల్లు-2026పై ఏర్పాటైన సెలెక్ట్ కమిటీ సమావేశం శనివారం హైదరాబాద్లో జరిగింది. ఈ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పలువురు ఎమ్మెల్యేలతో పాటు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిల్లులోని ప్రధాన నిబంధనలు, అమలు విధానం, వివిధ వర్గాల నుంచి వచ్చిన సూచనలపై కమిటీ సభ్యులు చర్చించారు. ఈ బిల్లును ఈ ఏడాది మార్చిలో తెలంగాణ శాసనసభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ద్వేషపూరిత ప్రసంగాలు, కులం, మతం, జాతి, భాష, ప్రాంతం లేదా ఇతర గుర్తింపుల ఆధారంగా వ్యక్తులు, వర్గాలపై విద్వేషాన్ని రెచ్చగొట్టే చర్యలను అరికట్టడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యం. మతం, కులం, జాతి, భాష లేదా ఇతర గుర్తింపుల ఆధారంగా విద్వేషాన్ని ప్రేరేపించే ప్రసంగాలు, సోషల్ మీడియా పోస్టులు, వీడియోలు, ప్రచార సామగ్రి, బహిరంగ సభల్లో చేసే ద్వేషపూరిత వ్యాఖ్యలను ఈ చట్టం కింద నేరంగా పరిగణించనున్నట్లు బిల్లులో ప్రతిపాదించారు. బిల్లులోని ప్రతిపాదనల ప్రకారం, మొదటిసారి నేరానికి కనీసం ఒక సంవత్సరం నుంచి గరిష్ఠంగా ఏడు సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు రూ. 50 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అదే నేరాన్ని పునరావృతం చేస్తే రెండు నుంచి పది సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు అధిక మొత్తంలో జరిమానా విధించాలని ప్రతిపాదించారు. అంతేకాకుండా, ద్వేషపూరిత నేరాల వల్ల నష్టపోయిన బాధితులకు తగిన నష్టపరిహారం అందించే విధానాన్ని కూడా బిల్లులో పొందుపరిచారు. బిల్లును మరింత సమగ్రంగా రూపొందించేందుకు వచ్చిన సూచనలు, అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం సెలెక్ట్ కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించనుంది.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో అవ్వాతాతల జీవితాల్లో భరోసా..

### నందిగామ 11వ వార్డులో ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ: పేదల సంక్షేమమే ధ్యేయంగా, అవ్వాతాతలకు అండగా నిలుస్తూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నందిగామ పట్టణం 11వ వార్డులో ఉత్సాహంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారులు, కూటమి నేతలతో కలిసి ఇంటింటికీ వెళ్లి వృద్ధులను ఆప్యాయంగా పలకరించి పెన్షన్లు అందజేశారు. టీటీడీ కల్యాణ మండపం సమీపంలో లబ్ధిదారులకు పెన్షన్లు అందజేసిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య.. పెన్షన్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం వారి కుటుంబాలకు ఏ విధంగా ఉపయోగపడుతుందో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అవ్వాతాతలతో ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గారు మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంధకారంగా ఉన్న సమయంలోనూ పేదల కష్టాలను అర్థం చేసుకుని, ఇంటి పెద్ద కొడుకులా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు అవ్వాతాతలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ప్రతి నెలా మొదటి తేదీనే పెన్షన్ అందిస్తూ పేదల కుటుంబాల్లో ఆర్థిక భరోసా నింపుతున్నారని తెలిపారు. ఒకటో తేదీ సెలవు రోజైతే అంతకుముందు రోజే పెన్షన్ అందించడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం మాటల్లో కాకుండా చేతల్లో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం.. ప్రతి అవ్వాతాత గడపకు భరోసాను చేర్చే ప్రభుత్వమని తంగిరాల సౌమ్య గారు స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం మరింత సమర్థవంతంగా ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నేతలు, స్థానిక ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చిత్తూరు జిల్లా నగరి మండలంలో కలకలం రేపిన ఘటన

చిత్తూరు : విద్యుత్ కనెక్షన్ కోసం ఏళ్ల తరబడి న్యాయ పోరాటం చేసిన ఓ కుటుంబంపై రౌడీ మూకలు మూకుమ్మడిగా దాడి చేశాయన్న ఆరోపణలు తీవ్ర సంచలనంగా మారాయి. కోర్టు ఆదేశాలు ఉన్నా అమలు చేయలేదని... అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి వచ్చిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో విద్యుత్ శాఖ అధికారులపై, పోలీసుల వ్యవహారశైలిపై కూడా తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం గాయపడిన బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చట్టం సామాన్యుడికి రక్షణ కల్పించేందుకా...? లేక బలవంతుల చేతిలో బలహీనులు బలైపోవడానికా...? అనే ప్రశ్నకు చిత్తూరు జిల్లా నగరి మండలంలో జరిగిన ఈ ఘటన అద్దం పడుతోంది. నగరి మండలం ఓజీ కుప్పం పంచాయతీలో నివసిస్తున్న ఆర్. వెంకటేశ్వర్, శాంతిలకు చెందిన తమ సొంత భూమికి విద్యుత్ కనెక్షన్ కోసం ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. బాధితుల వాదన ప్రకారం... కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చినా, ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా, స్థానిక స్థాయిలో విద్యుత్ శాఖ అధికారులు వాటిని అమలు చేయకుండా ఆలస్యం చేశారని ఆరోపిస్తున్నారు. ఇదే సమయంలో... విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేస్తున్న సమయంలో చందు, సుబ్రమణ్యం అనే వ్యక్తులు మరికొందరితో కలిసి తమ భూమిలోకి చొరబడి దాడి చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్, శాంతి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన వెనుక భూ కబ్జాదారులకు కొందరు అధికారులు అండగా నిలుస్తున్నారంటూ బాధితులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. విద్యుత్ శాఖ ఏఈ కోర్టు ఆదేశాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, ఉన్నతాధికారుల ఆదేశాలను కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు... స్థానిక పోలీసుల వ్యవహారంపై కూడా బాధితులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన వారు బాధితులకు న్యాయం చేయకుండా ఒత్తిళ్లు తెస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. ఒక సాధారణ విద్యుత్ కనెక్షన్ కోసం ఏళ్ల తరబడి న్యాయపోరాటం చేయాల్సి రావడం... చివరకు దాడులకు గురై ఆస్పత్రి పాలవడం... ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

## నిరుపేద మహిళకు లయన్స్ క్లబ్ చేయూత

కమాన్ పూర్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన నిరుపేద ఒంటరి మహిళ నివసిస్తున్న కిరాయి ఇల్లు కూలిపోవడంతో ఆమె తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ సభ్యులు, లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ బాబూరావు జన్మదినాన్ని పురస్కరించుకుని, బాధిత మహిళకు నిత్యావసర సరుకులను అందజేసి తమ సేవా భావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు డా. శరణ్య యాదవ్ మాట్లాడుతూ అంతర్జాతీయ డైరెక్టర్గా ప్రపంచవ్యాప్తంగా లయన్స్ క్లబ్ల సేవా కార్యక్రమాలకు మార్గనిర్దేశం చేస్తూ సేవే పరమావధి అనే భావనతో లక్షలాది మంది లయన్స్ సభ్యులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆయన నాయకత్వం, సేవా తపన, నిస్వార్థ అంకితభావం లయన్స్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అలాగే ప్రకృతి వైపరీత్యాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. సమాజ సేవే లయన్స్ ఉద్యమానికి మూల స్ఫూర్తి అని, అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ చేయూత అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి టీవీ సురేష్ బాబు, పాస్ట్ ప్రెసిడెంట్లు మొల్మూరి శ్రీనివాస్, మేకల మారుతి యాదవ్, క్లబ్ చైర్పర్సన్లు గంట వెంకటరమణ రెడ్డి, మర్రి శరణ్య తదితరులు పాల్గొన్నారు.

## రహదారి భద్రతను మరింత కట్టుదిట్టం

### - అక్రమ పార్కింగ్ పై కఠిన చర్యలు

### - తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ హెచ్చరిక

మహబూబాబాద్ : తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీవో) శంకర్ నాయక్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం, మహబూబాబాద్ జిల్లా గుండా వెళ్లే రెండు జాతీయ రహదారుల వెంట రహదారి భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా గుండా వెళ్లే రెండు జాతీయ రహదారుల వెంట ఉన్న భోజనశాలలు, హోటళ్లు, విశ్రాంతి కేంద్రాల వద్ద లారీలు, బస్సులు, ట్రాక్టర్లు తదితర భారీ వాహనాలను రాత్రి వేళల్లో నిర్లక్ష్యంగా నిలిపివేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా రహదారి పక్కన నిలిపిన వాహనాలకు వెనుక భాగంలో ఎరుపు ప్రతిబింబించే పట్టీలు లేదా ప్రతిబింబించే పలకలు, నిలుపుదల దీపాలు, హెచ్చరిక త్రిభుజ గుర్తులు లేకపోవడం వల్ల వేగంగా వచ్చే వాహనాలు ఢీకొనే ప్రమాదం అధికంగా ఉంటుందని తెలిపారు. డ్రైవర్లు, వాహన యజమానులు తప్పని సరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. మోటారు వాహనాల చట్టం?1988, సెక్షన్ 122 ప్రకారం జాతీయ రహదారులపై అకారణంగా లేదా ఇతరులకు ప్రమాదం కలిగే విధంగా వాహనాలను నిలిపి వేయడం చట్ట విరుద్ధమని తెలిపారు. అలాంటి వాహనాల ఛాయాచిత్రాలు, దృశ్యాల ఆధారంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా వాహనాలు నిలిపివేయరాని ప్రాంతాల్లో వాహనాలను నిలిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రహదారిపై నిర్లక్ష్యంగా వాహనాలను వదిలేయడం వల్ల ఇతరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లితే కఠిన చర్యలు తప్పవన్నారు. రవాణా శాఖ సూచనలు మహబూబాబాద్ జిల్లా గుండా వెళ్లే రెండు జాతీయ రహదారులపై అత్యవసర పరిస్థితులు మినహా వాహనాలను నిలిపి వేయరాదు. వాహనాలను భోజనశాలలు, హోటళ్ల ముందు లేదా రహదారి అంచున ప్రమాదకరంగా నిలిపివేయరాదని, తప్పని సరిగా ఆపాల్సి వస్తే రహదారికి సురక్షితమైన దూరంలో మాత్రమే నిలిపివేయాలని, వాహనం వెనుక భాగంలో ఎరుపు ప్రతిబింబించే పట్టీలు లేదా ప్రతిబింబించే పలకలు, ప్రతిబింబించే పట్టీ, నిలుపుదల దీపాలు తప్పనిసరిగా ఉండాలి. రాత్రి సమయంలో ప్రతిబింబించే హెచ్చరిక త్రిభుజ గుర్తు ఏర్పాటు చేయాలని, వాహనాల సాంకేతిక సామర్థ్య ధ్రువీకరణ (ఫిట్నెస్), బ్రేకులు, టైర్లు, దీపాలు సక్రమంగా ఉన్నాయో లేదో నిరంతరం పరిశీలించాలి. అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, నిర్లక్ష్యంగా వాహనం నడపడం పూర్తిగా నివారించాలని మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ కార్యాలయం ద్వారా ఒక ప్రకటన ద్వారా తెలపడం జరిగింది.

స్పెషల్ ఎడిషన్
తెలుగు దినపత్రిక





## హిట్ మెషిన్ ప్రయోగాలు..ప్రాజెక్టులు!

అనీల్ రావిపూడి వరుస విజయాలతో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. కెరీర్ ఆరంభం నుంచి ఇప్పటివరకూ అతడు పట్టిందల్లా బంగారమే అయింది. దీంతో హీరోల పాలిట అనీల్ బంగారు బాతులా మారిపోయారు. హీరోలంతా ఇప్పుడు అతడి కోసం క్యూ కడుతున్నారంటే అతిశయోక్తి కాదు. అయితే ఇప్పటి వరకు ప్రేక్షకులకు ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైనర్‌లను అందిస్తూ హిట్ మెషిన్ గా పేరు తెచ్చుకున్న అనీల్ ఇప్పుడు శైలిని మార్చుకుంటూ సరికొత్త ప్రయోగాలకు సిద్ధమవుతున్నారు. కమర్షియల్ చిత్రాలకే పరిమితం కాకుండా విభిన్నమైన జోనర్లలో సినిమాలను తెరకెక్కించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ప్రస్తుతం అనిల్ రావిపూడి టాలీవుడ్ విక్టరీ వెంకటేష్– నందమూరి కళ్యాణ్‌రామ్ కాంబినేషన్లలో ఓ సినిమా తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం ద్వారా మరోసారి తన మార్క్ కామెడీతో పాటు కుటుంబ ప్రేక్షకులను అలరించనున్నాడు. ఈ కథ పెద్దగా కొత్తగా ఏమీ ఉండదు. రొటీన్ గా కనిపించినా? అందులో అనీల్ మార్క్ మ్యాజిక్? ఉంటుంది. అందులో ఎలాంటి సందేహం లేదు. ఈ ప్రాజెక్ట్ పూర్తికాగానే అనీల్ తదుపరి చేయబోయే సినిమాలపై ఇండస్ట్రీలో అంచనాలు మొదలవుతున్నాయి. ఎప్పుడూ ఒకే జోనర్‌లో కాకుండా కంఫర్ట్ జోన్ నుండి పూర్తిగా బయటపడాలని అనిల్ రావిపూడి నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే తెలుగు తెరపై వినూత్నమైన యానిమేషన్ సినిమాను తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు. సాంకేతికంగా అత్యున్నత ప్రమాణాలతో రానున్న యానిమేషన్ ప్రాజెక్ట్ టాలీవుడ్‌లో ఓ కొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ యానిమేషన్ ప్రయత్నం తర్వాత నందమూరి బాలకృష్ణ..అక్కినేని నాగార్జున వంటి అగ్ర హీరోలతో సినిమాలు చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. అయితే ఈ రెండు సినిమా కథలు మాత్రం రెగ్యులర్ చిత్రాలకు భిన్నంగా ఉంటాయనే లీక్ అందింది. రొటీన్ అంశాన్ని పక్కన బెట్టి ఓ కొత్త పాయింట్ తోనే నాగ్, బాలయ్యలతో సినిమాలు చేస్తారని అంటున్నారు. ఈ విషయంపై ఇప్పటికే ఇద్దరు హీరోలతో అనీల్ డిస్కషన్ చేసినట్లు..వారు కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. బాలయ్య తో ఇప్పటికే –భగవంత్ కేసరి– కోసం పని చేసారు కాబట్టి అతడితో ప్రయోగం పెద్ద విషయం కాదు. నాగార్జున ఆ ఛాన్స్ తీసుకుంటారా? అన్న సందేహం ఉంది. ఎందుకంటే నాగార్జునకు ప్రయోగాలు పెద్దగా కలిసి రావడం లేదు. ఇదే ఫ్యామిలీ జోనర్లు ఇచ్చిన విజయాలు ప్రయోగాలు ఇవ్వడం లేదు. అందులోనూ అనీల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్లకు స్పెషలిస్ట్. అలాంటి దర్శకుడితో నాగ్ ప్రయోగాలు చేసే అవకాశాలు చాలా తక్కువనే తెలుస్తోంది. మరి ఇందులో నిజా నిజాలు తేలాల్సి ఉంది.

## సూర్య కామెంట్స్ తో స్టార్ సినిమాల ప్లానింగ్‌పై కొత్త చర్చ

పెద్ద సినిమాల గురించి ఫ్యాన్స్ ఎక్కువగా డిస్కస్ చేసేది రిలీజ్ డేట్, బడ్జెట్, స్టార్ కాస్టింగ్ గురించే. కానీ ఆ సినిమాలు నిజంగా ఎలా ప్లాన్ అవుతాయి? ఒక ప్రాజెక్ట్ అనౌన్స్ చేసిన తర్వాత కూడా అది ఎలాంటి దశల్లో ప్రయాణిస్తుంది? అనే అంశాలు చాలా తక్కువగా బయటకు వస్తుంటాయి. తాజాగా సూర్య చేసిన ఒక కామెంట్ మాత్రం ఈ ప్రశ్నలను మళ్లీ ఇండస్ట్రీ డిస్కషన్స్ లోకి తీసుకొచ్చింది. రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో భాగంగాను సూర్య ను రోలెక్స్ ప్రాజెక్ట్ గురించి అడిగినప్పుడు, ఆ సినిమా గురించి తనక్కూడా స్పష్టమైన సమాచారం లేదని సూర్య చెప్పడం ఆసక్తికరంగా మారింది. సాధారణంగా ఒక స్టార్ హీరోకు ఏ ప్రాజెక్ట్ ఎప్పుడు మొదలవుతుందో తెలుస్తుందనే ఫ్యాన్స్ అనుకుంటారు. కానీ కొన్ని భారీ ప్రాజెక్టుల విషయంలో హీరోలకు కూడా పూర్తి క్లారిటీ ఉండకపోవడం ఇండస్ట్రీ వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించే అంశంగా కనిపిస్తోంది. ఇక్కడ ప్రధాన ప్రశ్న రోలెక్స్ సినిమా వస్తుందా లేదా అన్నది కాదు. ఒక పాత్ర చుట్టూ భారీ అంచనాలు ఏర్పడిన తర్వాత కూడా ప్రాజెక్ట్ ఎందుకు ముందుకు వెళ్లడం లేదనేదే. డైరెక్టర్ షెడ్యూల్స్, నిర్మాతల బడ్జెట్ ప్లాన్, ఇతర కమిట్‌మెంట్లు, పాన్ ఇండియా మార్కెట్ లెక్కలు, థియేట్రికల్ విండో, డిజిటల్ డీల్స్ వంటి ఎన్నో అంశాలు ఒకే టైమ్ లో కుదరాల్సి ఉంటుంది. అందుకే సోషల్ మీడియాలో వేగంగా జరిగే అనౌన్స్మెంట్స్, వాస్తవ నిర్మాణ ప్రక్రియ మధ్య చాలా పెద్ద గ్యాప్ కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో మరో ఆసక్తికరమైన అంశం రోలెక్స్ పాత్ర చుట్టూ కొనసాగుతున్న మిస్టరీ. కొందరు ఇలాంటి పాత్రలను ఎక్కువ కాలం దాచిపెట్టడం వల్ల వాటి క్రేజ్ పెరిగి, ప్రేక్షకుల ఊహాశక్తి ఆ పాత్రకు మరింత విలువను తెస్తుందని అభిప్రాయపడుతుంటే, మరికొందరు మాత్రం ఎక్కువ ఆలస్యమైతే అదే హైప్ క్రమంగా తగ్గే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. ముఖ్యంగా వేగంగా మారుతున్న పాన్ ఇండియా మార్కెట్‌లో ప్రేక్షకుల దృష్టిని ఎక్కువ కాలం నిలబెట్టడం అంత ఈజీ కాదు. సూర్య కామెంట్స్ ఒక విషయాన్ని మాత్రం స్పష్టం చేస్తున్నాయి. పెద్ద సినిమాలు బయట కనిపించేంత సింపుల్‌గా ప్లాన్ కావని సూర్య కామెంట్స్ ను బట్టి అర్థమవుతుంది.






## సుకుమార్ కొత్త ఛాయిస్‌లో ప్లస్‌లు, రిస్కులు

సినిమా ఇండస్ట్రీలో ఒక సక్సెస్‌ఫుల్ కాంబినేషన్ ఎక్కువ కాలం కొనసాగడం అనేది అంత తేలికైన విషయం కాదు. ఎన్నో ఏళ్లపాటు ట్రాక్ రికార్డ్ ఉన్నప్పటికీ, పరిస్థితులు, బాక్సాఫీస్ లెక్కలు మారేసరికి మార్పులు తప్పవు. ఒకప్పుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, కొరటాల శివ లాంటి స్టార్ డైరెక్టర్లు వరుసగా దేవి శ్రీ ప్రసాద్‌తోనే సినిమాలు చేస్తూ వచ్చారు. కానీ మారతున్న ఆడియన్స్ టేస్ట్, మేకింగ్ శైలికి తగ్గట్టు వాళ్లు కూడా కొత్త మ్యూజిక్ డైరెక్టర్ల వైపు అడుగులు వేశారు. అయితే కాంబినేషన్‌ను మార్చడం వల్ల ప్రాజెక్ట్‌కి ఒక రకమైన కొత్తదనం వస్తుందనడంలో సందేహం లేదు. సుకుమార్ రామ్ చరణ్ కాంబినేషన్ అనౌన్స్ అయినప్పటి నుంచే సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ కోసం దేవి శ్రీ ప్రసాద్ స్థానంలో కొత్త మ్యూజిక్ డైరెక్టర్ పేరు ప్రచారంలోకి రావడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. ఆర్‌ఆర్‌ఆర్ లాంటి గ్లోబల్ విజయం తర్వాత రామ్ చరణ్ సినిమాకు పక్కా డిఫరెంట్ సౌండింగ్ ఇవ్వాలనే ఆలోచనతోనే ఈ ప్రయోగం చేస్తున్నట్లు సమాచారం. కొత్త కాంబినేషన్ వల్ల ఒకవైపు క్రేజ్, ఫ్రెష్ వైబ్ వస్తుంది కానీ, మరోవైపు అంతకుమించిన రిస్క్ కూడా పొంచి ఉంటుంది. ఆర్య నుంచి రంగస్థలం, పుష్ప వరకు సుకుమార్ దేవి శ్రీ ప్రసాద్ కాంబో ఇండస్ట్రీలో ఆల్ టైమ్ చార్ట్‌బస్టర్ ఆల్బమ్స్ అందించింది. వీరిద్దరి మధ్య ఉన్న బాండింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. సుకుమార్ విజన్ కి దేవి ఇచ్చే మ్యూజిక్ ఎప్పుడూ ఒక రేంజ్ లో సింక్ అయ్యేది. ఇప్పుడు అంతటి ఐకానిక్ ట్రాక్ రికార్డ్‌ను పక్కనపెట్టి కొత్త టెక్నీషియన్‌ను ఎంచుకున్నప్పుడు ఆ అంచనాలను అందుకోవడం అతిపెద్ద సవాల్ గా మారుతుంది. ట్రెండ్ మారుతున్న సమయంలో ఇలాంటి ప్రయోగాలు ఎంతవరకు వర్కౌట్ అవుతాయనేది అసలు పాయింట్. ఒక మ్యూజిక్ డైరెక్టర్ లోని బెస్ట్ అవుట్‌పుట్‌ను బయటకు తీయడంలో సుకుమార్‌కు మంచి అనుభవం ఉంది. కాబట్టి కొత్త మ్యూజిక్ డైరెక్టర్‌తో ఆయన ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తారనేది చాలా కీలకం. పాత రొటీన్ సౌండింగ్ కి భిన్నంగా, సరికొత్త ఆర్‌ఆర్‌ఆర్ బాటలో చరణ్ ఇమేజ్ కి తగ్గట్లు గ్లోబల్ అప్పీల్ ఉండే మ్యూజిక్ ఇస్తే మాత్రం ఈ కాంబినేషన్ ఛేంజ్ వర్కౌట్ అయినట్లే. ఈ మార్పుల వల్ల సినిమా బిజినెస్ కి గానీ, క్రియేటివ్ వైబ్‌కి గానీ కొత్త ఎనర్జీ వచ్చే అవకాశం ఉంటుంది. కాంబినేషన్లు మారడం సినీ పరిశ్రమలో చాలా కామన్ అయినా, సుకుమార్ లాంటి బ్రాండ్ క్రియేటర్ తన మ్యూజిక్ డిపార్ట్‌మెంట్‌ను రీ డిజైన్ చేయడం ఖచ్చితంగా ఒక డిఫరెంట్ గేమ్. చూడాలి మరి ఎం జరుగుతుందో.

## మాట వినకపోతే కఠిన చర్యలు తప్పవు..



సినిమా స్టార్స్ అంటే అభిమానం ఉండటం సహజమే, కానీ ఆ అభిమానం పేరుతో లేదా వ్యూస్ కోసం వారి వ్యక్తిత్వాన్ని హాని చేయడం సరైంది కాదు. గత కొన్ని రోజులుగా లేనిపోని రూమర్లతో ఇబ్బంది పడుతున్న నటి మృణాల్ ఠాకూర్, ఇప్పుడు మరో పెద్ద సమస్యను ఎదుర్కొంటోంది. ఆమెకు సంబంధించిన డీప్‌ఫేక్ వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారమవుతున్నాయి. దీనిపై తీవ్రంగా స్పందించిన మృణాల్, “వెంటనే ఆ కంటెంట్‌ను తొలగించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవు” అని గట్టిగా హెచ్చరించింది. ఈ రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత ఎంతగానో ఎదుగుతోంది. అయితే దానిని మంచి కోసం కాకుండా, కొందరు నెటిజన్లు సెలబ్రిటీల ముఖాలను వేరే వీడియోలలో మార్చేసి (డీప్‌ఫేక్) పోస్ట్ చేస్తున్నారు. మృణాల్ విషయంలో కూడా సరిగ్గా ఇదే జరిగింది. ఆమె అనుమతి లేకుండా, అసభ్యకరంగా ఆమె రూపాన్ని మార్చి సోషల్ మీడియాలో షేర్ చేయడం పెద్ద వివాదంగా మారింది. మృణాల్ గట్టి హెచ్చరిక: ఈ వ్యవహారంపై మృణాల్ ఠాకూర్ అస్సలు తగ్గలేదు. సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. “నాకు సంబంధించిన డీప్‌ఫేక్ వీడియోలను వెంటనే డిలీట్ చేయండి. ఇక ఇవి పూర్తిగా అక్రమమైనవి. ఒకవేళ మాట వినకపోతే, లీగల్ యాక్షన్ తీసుకుంటాను, పోలీసులకు ఫిర్యాదు చేస్తాను” అని తీవ్రంగా హెచ్చరించింది. ఆమె తీసుకున్న ఈ నిర్ణయానికి నెటిజన్ల నుంచి, సినిమా పరిశ్రమ నుంచి భారీ మద్దతు లభిస్తోంది. కేవలం మృణాల్ ఒక్కరే కాదు..: ఇలా డీప్‌ఫేక్ బారిన పడటం మృణాల్‌కే తొలిసారి కాదు. గతంలో రష్మిక మందన్నా, కత్రినా కైఫ్, ఆలియా భట్ వంటి ఎంతో మంది కథానాయికలు కూడా ఈ AI వికృత చేష్టలకు బాధితులుగా మారారు. ఇక సైబర్ నేరగాళ్లు కేవలం లైక్స్, వ్యూస్ కోసం ఒకరి వ్యక్తిగత జీవితాన్ని, గౌరవాన్ని బజారున పడేస్తున్నారనడానికి ఇదొక పెద్ద ఉదాహరణ. టెక్నాలజీ మంచిదే.. కానీ వాడే విధానం?: సాంకేతికత అనేది మన జీవితాన్ని సులభతరం చేయడానికి, కొత్త ఆవిష్కరణల కోసం ఉపయోగపడాలి. కానీ, దానిని ఒకరి ప్రైవసీని దెబ్బతీయడానికి, వేధించడానికి ఆయుధంగా మార్చడం చాలా ప్రమాదకరం. ఇక ఇలాంటి చర్యలు ఏమాత్రం సహించరానివని మృణాల్ హెచ్చరికతో మరోసారి స్పష్టమైంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంత వేగంగా పెరుగుతుందో, అంతకంటే వేగంగా కఠినమైన సైబర్ చట్టాలు అమలు కావాల్సిన అవసరం ఉంది. మృణాల్ ఠాకూర్ ఇచ్చిన ఈ హెచ్చరిక, ఇంటర్నెట్‌లో ఇలాంటి తప్పుడు పనులు చేసే వారికి ఒక మంచి పాఠం లాంటిది. వేరొకరి గౌరవానికి భంగం కలిగిస్తే చట్టం ఊరుకోదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

## తమిళ మార్కెట్లో తెలుగు యువనిర్మాత బిగ్ ప్లాన్స్



టాలీవుడ్ నిర్మాతలు ఇరుగు పొరుగు భాషల్లోకి దూసుకెళుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే అల్లు అరవింద్, దిల్ రాజు లాంటి అగ్ర నిర్మాతలు బాలీవుడ్ లోను సినిమాలు నిర్మిస్తున్నారు. ఇప్పుడు యువ నిర్మాత నాగవంశీ తెలుగు సినిమాలతో పాటు తమిళ పరిశ్రమలోను బిజీగా మారారు. తాజాగా ద్విభాషా చిత్రం విశ్వనాథన్ అండ్ సన్స్ ఆడియో లాంచ్ వేడుకలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత, నిర్మాత నాగవంశీ చేసిన వ్యాఖ్యలు దక్షిణాది సినీ వర్గాలను విశేషంగా ఆకట్టుకున్నాయి. కోయంబత్తూరులో జరిగిన ఈ వేడుకలో అతడు మాట్లాడుతూ.. తమ ప్రయాణం పళని పూజతో ఇక్కడే ప్రారంభమైందని .. కోయంబత్తూరు నగరం తమ బ్యానర్‌కు ఒక లక్కీ ఛార్మ్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమిళంలో తమకు ఇది రెండవ చిత్రమైనా స్థానిక ప్రేక్షకుల ఆదరణపై పూర్తి ధీమాను కనబరిచారు. తమిళ అగ్ర కథానాయకుడు సూర్య తమపై ఉంచిన నమ్మకాన్ని నాగవంశీ ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు. తెలుగు పరిశ్రమ నుంచి వచ్చిన యువ నిర్మాతలను నమ్మి... కథ విన్న మొదటి క్షణం నుంచే ఏమాత్రం సందేహపడకుండా ప్రాజెక్ట్ ఓకే చేసినందుకు సూర్యకి ధన్యవాదాలు తెలిపారు. గజినీ చిత్రంలో సూర్య చేసిన ఐకానిక్ క్యారెక్టర్ సంజయ్ రామస్వామి స్థాయి పాత్రను.. ఆయనలోని పూర్తి ఎనర్జీని ఈ చిత్రం ద్వారా అభిమానులకు మళ్లీ తిరిగి ఇస్తామని హామీ ఇచ్చారు. సినిమా కంటెంట్, ముఖ్యమైన పాత్రల గురించి మాట్లాడుతూ నాగవంశీ కొన్ని ఆసక్తికరమైన విషయాలను షేర్ చేసారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న మమితా బైజు నటన జెన్–జీ యువతను విశేషంగా ఆకట్టుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. అలాగే సీనియర్ నటి రాధిక సూర్య తల్లిగా అద్భుతంగా నటించారని.. ఫస్ట్ హాఫ్‌లో సూర్య, రాధిక, మమితల మధ్య వచ్చే ఒక ప్రత్యేకమైన కామెడీ సీన్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుందని చిన్న లీక్ ఇచ్చారు. తమ సినిమా అవుట్‌పుట్‌పై స్పందిస్తూ.. నాగవంశీ సినిమా విజయంపై పూర్తి ధీమాగా ఉన్నారు. తెలుగులో తమ బ్యానర్‌లో వచ్చిన ఆల్‌టైమ్ బిగ్గెస్ట్ హిట్స్ తరహాలోనే ఈ చిత్రం కూడా తమిళ బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే సంగీత దర్శకుడికి జీవీకి సరదాగా మాస్ వార్నింగ్ ఇస్తూ.. సూర్య అభిమానులకు నచ్చేలా అత్యుత్తమ రీ–రికార్డింగ్ అందించాలని... హ్యాట్రిక్ హిట్‌ను అందించాల్సిన బాధ్యత మ్యూజిక్ డైరెక్టర్‌పై ఉందన్నారు. చివరగా సోషల్ మీడియాలో తనను చింటూ అని ఎందుకు పిలుస్తారో ఈవెంట్‌లో అడిగిన ప్రశ్నకు నాగవంశీ తనదైన శైలిలో సమాధానమిచ్చారు. తాను సోషల్ మీడియా వేదికగా కాస్త ఓపెన్‌గా బోల్డ్‌గా స్పందిస్తుంటానని.. అందుకే అక్కడ అభిమానులు సరదాగా తనకు ఆ పేరు పెట్టారని క్లారిటీ ఇచ్చారు. వైవిధ్యమైన ప్రమోషన్లతో పాటు నిర్మాత నాగవంశీ చూపిన ఈ కాన్ఫిడెన్స్ చూస్తుంటే విశ్వనాథన్ అండ్ సన్స్ సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి పెరిగింది.

## మెగాస్టార్ దసరా సెంటిమెంట్ మళ్లీ వర్కవుట్ అవుతుందా?

దసరా సీజన్ అంటే టాలీవుడ్‌లో కేవలం ఒక పండుగ సీజన్ మాత్రమే కాదు, థియేటర్ బిజినెస్‌కు అత్యంత కీలకమైన విండోగా కూడా భావిస్తారు. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్, పిల్లలు, ఫెస్టివల్ హాలీడేస్ కలిసి వచ్చే ఈ సీజన్‌లో రిలీజయ్యే పెద్ద సినిమాలకు సహజంగానే విస్తృతమైన మార్కెట్ లభిస్తుంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కిన విశ్వంభర సినిమాను దసరా సందర్భంగా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారనే విషయంపై ఇండస్ట్రీలో ఇంట్రెస్టింగ్ డిస్కషన్ జరుగుతోంది. ఫాంటసీ జానర్‌కు దసరా మంచి సీజన్ అనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో చాలాకాలంగా ఉంది. విజువల్ గ్రాండియర్, మిథికల్ ఎలిమెంట్స్, అడ్వెంచర్, మ్యాజికల్ వరల్డ్ వంటి అంశాలు పిల్లల నుంచి పెద్దల వరకు అన్ని వయసుల ప్రేక్షకులను ఆకర్షించే సామర్థ్యం కలిగి ఉంటాయి. పండుగ సెలవుల్లో ఫ్యామిలీ అంతా కలిసి థియేటర్‌కు వెళ్లే అలవాటు ఇంకా బలంగానే ఉండటంతో, ఫాంటసీ సినిమాలు మల్టిపుల్ టికెట్ సేల్స్‌కు దోహదపడతాయి. ఒకే ఫ్యామిలీలో నలుగురు లేదా ఐదుగురు కలిసి సినిమా చూసే అవకాశం ఈ సీజన్‌లో ఎక్కువగా ఉంటుంది. అక్టోబర్ మధ్యలో వచ్చే దసరా హాలిడే పీరియడ్‌ను టార్గెట్ చేయడం కూడా బిజినెస్ పరంగా స్ట్రాటజిక్ డెసిషన్ గానే కనిపిస్తుంది. వీకెండ్‌తో పాటూ, పండగ సెలవులు సినిమాకు లాంగ్ రన్ ఓపెనింగ్‌ను అందించే అవకాశాన్ని పెంచుతాయి. మొదటి నాలుగు లేదా ఐదు రోజుల కలెక్షన్లు భారీగా ఉంటే, ఆ మూమెంటం తర్వాతి వారానికీ కంటిన్యూ అయ్యే అవకాశముంటుంది. అందుకే దసరా రిలీజ్ డేట్ కోసం పెద్ద సినిమాల మధ్య పోటీ తీవ్రంగా ఉంటుంది. ఇలాంటి సమయంలో స్క్రీన్ కౌంట్ కూడా కీలక అంశంగా మారుతుంది. ఒక పెద్ద స్టార్ సినిమా ఫెస్టివల్ సీజన్‌లో వస్తే, ఎక్కువ థియేటర్లు, ఎక్కువ స్క్రీన్లు కేటాయించే




ప్రయత్నం చేస్తాయి. దీనివల్ల ఇతర సినిమాల రిలీజ్ క్యాలెండర్‌పై కూడా ప్రభావం పడే అవకాశం ఉంటుంది. కొన్ని ప్రాజెక్టులు ముందుకు రావడం లేదా వెనక్కి వెళ్లడం వంటి మార్పులు ట్రేడ్ లెక్కల్లో భాగమవుతాయి. చిరంజీవి సినిమాలకు ఫెస్టివల్ సీజన్‌లో మంచి డిమాండ్ కూడా ఉంది. ఆయన కెరీర్‌లో పండుగల టైమ్ లో రిలీజైన ఎన్నో సినిమాలు ఫ్యామిలీ ఆడియన్స్ సపోర్ట్ తో భారీ కలెక్షన్లు సాధించిన సందర్భాలున్నాయి. అందువల్ల మెగాస్టార్ ఇమేజ్, ఫ్యామిలీ కనెక్ట్, ఫాంటసీ జానర్, దసరా హాలిడే అడ్వాంటేజ్ ఈ నాలుగు అంశాలు కలిస్తే, మార్కెట్ పరంగా ఒక పెద్ద ఈవెంట్ మూవీగా రూపుదిద్దుకునే అవకాశాలుంటాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దసరా బాక్సాఫీస్ పోరులో చివరికి సక్సెస్ ను డిసైడ్ చేసేది కంటెంట్ అయినప్పటికీ, సరైన రిలీజ్ టైమింగ్ మాత్రం ఆ సక్సెస్ కు బలమైన పునాది వేస్తుందనేది ట్రేడ్ వర్గాల అంచనా.

PUBLISHED, OWNED, EDITED BY SREERAMOJU BALANARASIMHA CHARY(PRGI : TGTEL/26/A0688), 4-12-798, DWARAKA MAI NAGAR, VANASTHALIPURAM, RANGA REDDY DIST, HYDERABAD - TELANGANA STATE -500070. 9440189819.
PRINTED AT SMILYS ONLINE #6-7-48, VANASTHALIPURAM SHOPPING COMPLEX, HYDERABAD, RANGAREDDY-TELANGANA-500070, PH:- 9440189819, specialeditiondaily@gmail.com